

లక్ష పట్టుచీరలతో గణపతి విగ్రహం



గాజువాక లంకా మైదానంలో లక్ష పట్టుచీరలతో భారీ వినాయక విగ్రహం ఏర్పాటుచేస్తున్నారు. దీని ఎత్తు 89 అడుగులు. ఉత్సవాల అనంతరం లక్ష చీరలను మహిళలకు పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

రక్షణ మంత్రికి ఘన స్వాగతం



నగర పర్యటనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఐఎన్‌ఎస్ డేగాలో ఘన స్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం మధ్యాహ్నం 12.40 గంటలకు విశాఖ చేరుకున్న రాజ్‌నాథ్‌సింగ్‌కు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నగరానికి వెళ్లారు. - గోపాలపట్నం, ఆంధ్రజ్యోతి

పూర్ణామార్కెట్‌కు చవితి సందడి



వినాయక చవితి సందర్భంగా మంగళవారం పూర్ణామార్కెట్ కిటకిటలాడింది. ఉదయం నుంచీ వర్షం పడడంతో వ్యాపారాలు సాగలేదు. సాయంత్రం తెరిపినివ్వడంతో పూజాసామగ్రి కొనుగోలుకు జనం వెల్లువలా తరలివచ్చారు. దీంతో ధరలు అమాంతం పెంచేశారు.

జీఎంల చేతికి పలుగు, పార!

స్టీల్‌ప్లాంటు ఇన్‌చార్జి సీఎండీ విచిత్రమైన నిర్ణయాలు

- మరో నెల రోజుల్లో రిటైర్ కాబోయే ఉన్నతాధికారులకు కన్వేయర్ బెల్ట్‌ల వద్ద విధులు
- ఇటువంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదంటున్న ఉద్యోగ వర్గాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటులో ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెలకు రూ.2 లక్షల జీతం తీసుకునే డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి అధికారుల చేతికి గునపాలు, పారలు ఇచ్చి కూలి పనులు చేయిస్తున్నారు. వారంతా ఇంకో నెల రోజుల్లో రిటైర్ కావలసి ఉంది. రెండు రోజుల క్రితమే వారి వీఆర్‌ఎస్‌కు కూడా ఆమోదం తెలిపారు. అటువంటి వారితో కూలి పనులు చేయించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏమి చేసినా తనను ఎవరూ ప్రశ్నించడం లేదనే ధీమానే సీఎండీతో ఇవన్నీ చేయిస్తోందనే వాదన వినిపిస్తోంది.



మూడు నెలల్లో రిటైరయ్యే అధికారులు పారలు పట్టుకొని పనిచేస్తున్న దృశ్యం

కర్మాగారంలోని రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ) నుంచి ఐరన్‌ఓర్, కోల్, లైమ్ స్టోన్, తదితర ముడి పదార్థాలను కన్వేయర్ల ద్వారా విభాగాలకు తరలిస్తున్నప్పుడు మెటీరియల్ కొంత కింద పడిపోతుంది. వాటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేయడానికి కాంట్రాక్టు కూలీలు ఉంటారు. వారికి నెలకు రూ.20 వేలు జీతం ఇచ్చేవారు. అలాంటి పనులు చేసే కాంట్రాక్టు వర్కర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, మే నెలలో 4,500 మందిని సీఎండీ తొలగించారు. దాంతో సిబ్బంది కొరత ఏర్పడింది. కింద పడిన మెటీరియల్ భారీగా ఎక్కడికక్కడ పేరుకుపోవడంతో కన్వేయర్లు రెండు వారాలుగా సరిగా నడవడం లేదు. దాంతో ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. పేరుకుపోయిన కుప్పలను తొలగించడానికి కూలీలను పెట్టుకుంటే సరిపోతుంది. కానీ సీఎండీ కూలీలకు బదులుగా లక్షల రూపాయల జీతం తీసుకుంటున్న సీనియర్ ఉన్నతాధికారులకు ఆ పనులు పురమాయించారు. ఇంకో నెల, రెండు నెలల్లో రిటైర్ కావలసిన 263 మంది ఉన్నతాధికారులను ఆర్‌ఎంహెచ్‌పీలో పనిచేయాలని సోమవారం సాయంత్రం ఆదేశించారు. వారంతా మంగళవారం అక్కడకు వెళ్లి పలుగు, పారలు చేతపట్టి పేరుకుపోయిన కుప్పల తొలగింపు పనులు ప్రారంభించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన స్టీల్‌ప్లాంటులో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) అనే సంస్థ సీఎండీగా పనిచేస్తున్న ఏకే సక్సేనాను గత సెప్టెంబరులో తీసుకువచ్చి ఇన్‌చార్జి సీఎండీగా నియమించారు. ఆయన పదవీ విరమణ సమయం ఇంకో మూడు నెలలు ఉంది. వాస్తవానికి స్టీల్ సీఎండీగా శక్తిమణి అనే అధికారిని కేంద్ర కమిటీ ఎంపిక చేసింది. ఆయనకు బాధ్యతలు అప్పగించకుండా ఈయన్నే కొనసాగించడం అనేక అనర్థాలకు దారితీస్తోంది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడపడానికి అడ్డగోలు ఒప్పందాలు చేసుకొని ఉత్పత్తి వ్యయం పెంచారనే విమర్శలు ఉన్నాయి. వంద

... మిగతా 6వ పేజీలో

టీడీపీ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

ఎంపీ, ఎమ్మెల్యేలతో త్రిసభ్య కమిటీ సమావేశం

- అనంతరం ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాల సేకరణ
- రేస్‌లో గండి బాబ్జీ, పట్టాభి, దువ్వారపు, సీతంరాజు సుధాకర్, గాడు చిన్నికుమారి, రాజబాబు
- నివేదికను అధినేతకు అందజేస్తామన్న కమిటీ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్ష పదవికి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు గండి బాబ్జీతో పాటు మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, సీనియర్ నాయకులు చోడే వెంకట పట్టాభి, మహ్మద్ నజీర్, కోరాడ రాజబాబు రేస్‌లో ఉన్నారు. ఇంకా భీమిలి మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, విజయనగరం డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, తెలుగు యువత నాయకుడు లొడగల కృష్ణ, తదితరులు అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు.

మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కుడిపూడి సత్తిబాబుతో కూడిన త్రిసభ్య కమిటీ మంగళవారం పార్టీ కార్యాలయంలో

... మిగతా 6వ పేజీలో



టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు. వేదికపై ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, దువ్వారపు రామారావు, ఇతర పార్టీ నాయకులు ఉన్నారు.

సమర్థులకే పదవులు

- ఆశావహుల దరఖాస్తులు అధినేతకు అందజేస్తాం
- తుది నిర్ణయం ఆయనదే
- జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీలో సమర్థులకే పదవులు వస్తాయని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. అందరినీ సమన్వయం చేసుకునే నేర్పరితనం, పార్టీకి తగినంత సమయం కేటాయించగలిగిన వారికి అవకాశాలు వస్తాయన్నారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యవర్గం ఎంపిక కోసం అధిష్ఠానం నియమించిన ముగ్గురి సభ్యులతో కూడిన కమిటీ మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత

... మిగతా 6వ పేజీలో

ఏయూలో గందరగోళం

- అధికారుల మధ్య విభేదాలు
- కొరవడిన సమన్వయం
- ఈ నేపథ్యంలోనే రిజిస్ట్రార్ రాజీనామా
- వీసీకి, ఉన్నతాధికారులకు నడుమ కూడా అంతరం
- కీలక నిర్ణయాలు తీసుకునేప్పుడు కనీసం తమకు సమాచారం ఇవ్వడం లేదని ప్రిన్సిపాల్స్ అసంతృప్తి
- పదవుల నుంచి తప్పుకునే యోచనలో కొందరు?
- శతాబ్ది వేడుకలు జరుగుతున్న వేళ వర్సిటీలో నెలకొన్న పరిస్థితులపై అధ్యాపక, విద్యార్థి వర్గాల్లో ఆందోళన



విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయం కొరవడింది. ఇది పాలనపై ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా కీలకమైన నిర్ణయాలు, కొన్ని నియామకాల విషయంలో అధికారుల మధ్య పొరపొచ్చాలు ఉన్నట్టు చెబుతున్నారు. తాజాగా రిజిస్ట్రార్ రాజీనామా వర్సిటీలో నెలకొన్న పరిస్థితులను బహిర్గతం చేసింది. అయితే, వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ నడుమ మాత్రమే కాదని, మరికొంతమంది ఉన్నత అధికారులకు, వీసీకి మధ్య కూడా అంతరం పెరిగిందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

వైస్ చాన్సలర్ తీరుపై వర్సిటీలోని కొన్ని కాలేజీలకు చెందిన ప్రిన్సిపాల్స్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు చెబుతున్నారు. కీలక నిర్ణయాలను తీసుకునే సమయంలో కనీసం తమకు సమాచారం ఇవ్వడం లేదని ప్రిన్సిపాల్స్ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కొద్దిరోజుల కిందట హాస్టళ్లకు వార్డెన్లను వీసీ నియమించారు. సాధారణంగా హాస్టళ్లకు ఆయా కాలేజీలకు చెందిన ప్రిన్సిపాల్స్ చైర్మన్లుగా వ్యవహరిస్తారు. వార్డెన్లను నియమించాలనుకున్నప్పుడు తప్పనిసరిగా ప్రిన్సిపాల్స్ రికమండేషన్స్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, వారికి

... మిగతా 6వ పేజీలో

భారీ వర్షం

ఉదయం నుంచి ముసురు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- భీమిలిలో 6 సెంటీమీటర్ల వర్షపాతం
- నేడు కూడా వర్షాలు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నగరంలో మంగళవారం భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తెరిపివ్వలేదు. ఈ సీజన్‌లో పది రోజుల క్రితం ఒకసారి రోజంతా వర్షం కురిసింది. మళ్లీ మంగళవారం అదేవిధంగా ముసురు వాతావరణం కొనసాగింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడా రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భీమిలిలో 60, మహారాణిపేటలో 52.2, పెందుర్తి 51.8, గాజువాక, ములగాడల్లో 51.4, ఆనందపురంలో 51.2, పెదగంట్యాడలో 51, విశాఖపట్నం రూరల్‌లో 50.6, సీతమ్మధారలో 48.6, గోపాలపట్నంలో 44.2, పద్మనాభంలో 39.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా బుధవారం

... మిగతా 6వ పేజీలో



అక్కయ్యపాలెం వద్ద జాతీయ రహదారిపై నిలిచిన నీరు

విగ్రహం ఎత్తును బట్టి నిమజ్జన ప్రదేశాలు ఎంపిక

- క్యూఆర్‌కోడ్ ఉన్న వాహనాలకే అనుమతి
- బాణసంచా నిషేధం
- సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకచవితికి మండపాలు వేసేవారంతా సింగిల్‌విండో విధానంలో అనుమతి తీసుకోగానే వారికి క్యూఆర్‌కోడ్ కేటాయిస్తున్నామన్నారు. ఆ కోడ్ కలిగిన వాహనాన్ని మాత్రమే విగ్రహం నిమజ్జనానికి వినియోగించాల్సి ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ లేని వాహనాలను అనుమతించబోమన్నారు. అలాగే నిమజ్జనం కోసం వాడే

... మిగతా 6వ పేజీలో

బార్‌లకు కానరాని స్పందన

జిల్లాలో 121 బార్‌లు

- 42 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో గడువు మరో మూడు రోజులు పెంపు
- ఈనెల 29 వరకు అవకాశం


విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు దరఖాస్తు గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో 121 బార్‌లకు రెండేళ్ల కాలవ్యవధితో లైసెన్స్ జారీచేసేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసక్తి కలిగినవారు ముందుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ వెబ్‌సైట్‌లో తమ పేరును ఎన్‌రోల్ చేసుకుని, తర్వాత రూ.5.1 లక్షలు డీడీ

... మిగతా 6వ పేజీలో

29న సీఎం రాక

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 29న నగర పర్యటనకు రానున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు నగరానికి చేరుకుంటారు. తొలుత నోవాటెల్‌లో జరగనున్న ఫుడ్ మానుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌లో ఉదయం 11.45 నుంచి 12.45 గంటల వరకు పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుని అక్కడ జరిగే గ్రిఫిన్ ఫౌండర్ నెట్‌వర్క్ మీటింగ్‌కు హాజరవుతారు. సాయంత్రం 4.20 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని బెంగళూరు వెళతారు.

ఉచితంగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



సింహాచలంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న అప్పలస్వామి



కొమ్మాదిలో మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న నాగోతిసత్యనారాయణ

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో శ్రీవీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో 21 రకాల వినాయక పూజ పత్రి ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని మెయిన్‌రోడ్డులో భీమిలి శ్రీవీరాంజనేయ అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 2,500 వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ పురోహితులు సుసరాపు మాధవ కామేశ్వరశాస్త్రి ప్రారంభించారు.

కొమ్మాదిలో...

కొమ్మాది (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజించాలని 5వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నాగోతి సత్యనారాయణ అన్నారు. నగరంపాలెం, మధురవాడ జంక్షన్ వద్ద శ్రీపరదేశమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో..

సాగర్‌నగర్ (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను రసాయనాల రంగులతో, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో జరుపుకోకుండా పర్యావరణ హితంగా జరుపుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జీఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు పిలుపునిచ్చారు. గీతం స్కూల్ ఆఫ్ పర్యావరణ శాస్త్ర విభాగం, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మట్టి గణపతి ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. ప్రకృతి పరిరక్షణకు మట్టి ప్రతిమలు దోహద పడతాయని అన్నారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహాయంతో గీతంలో పెద్ద ఎత్తున వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంత రామకృష్ణ మాట్లాడారు.

సింహాచలంలో...

సింహాచలం (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులకు పూజించడం వల్ల పర్యావరణానికి మేలు కలుగుతుందని అడివివరం సహకార పరపతి సంఘం పాలకమండలి, అప్పలస్వామి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కర్రి అప్పలస్వామి అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ట్రస్టు ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు గణపతి మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడివివరం సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆనందపురంలో...

ఆనందపురం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలసలో శ్రీషిర్డీసాయి సెల్ కార్నర్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెల్ కార్నర్ యజమాని మేడిశెట్టి రాంజీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పతివాడ రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు మట్టి విగ్రహాలు అందజేశారు. శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో 250, ప్రభుత్వ పాఠశాలలో వంద విగ్రహాలను పంపిణీ చేశారు.

పద్మనాభంలో...

పద్మనాభం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో శ్రీనివాస యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కె.సన్యాసినాయుడు, కార్యదర్శి పద్మనాభస్వామి, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు ఇంద్రారావు, చిరంజీవి, రిటైర్డు ఎంపీడీఓ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం రూరల్

భీమునిపట్నం (రూరల్) (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం చిప్పాడ దివీస్ కర్మాగారం పనిచేస్తున్న ఆరు వేల మంది సిబ్బందితో పాటు పరిసర 11 గ్రామాలకు చెందిన వారికి ఏడు వేలు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ కమిషనర్ సుదర్శన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని లక్ష్మీపురంలో మట్టి వినాయక విగ్రహాలను మంగళవారం జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు పంపిణీ చేశారు. అందరూ మట్టితో చేసిన వినాయక ప్రతిమలను మాత్రమే వినియోగించాలని కోరారు.

తగరపువలసలో..

తగరపువలస (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస పరిధిలో వివిధ ప్రాంతాల్లో మట్టి వినాయక ప్రతిమలను పలువురు పంపిణీ చేశారు. ఈ సమీపంలో అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ ఎంఎల్‌ఏ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యాపకులకు విద్యార్థులు, వినాయక ప్రతిమలను అందజేశారు. పర్యావరణకు హాని లేకుండా వినాయక పండుగ నిర్వహించాలని కోరారు. వెంపాడ వెల్ఫేర్ సొసైటీ తరపున శ్రీనివాసరెడ్డి చిట్టివలస అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రెండువేల మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అభివృద్ధి పరుగులు పెడుతోంది

▸▸ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

సాగర్‌నగర్, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గంలోని అభివృద్ధి పరుగులు తీస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 8వ వార్డు పరిధిలో రూ.2.71 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టుల నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావుతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 16 కోట్లతో సాగర్‌నగర్ బీచ్ అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేశామని, రూ.3 కోట్లతో ఈట్ స్ట్రీట్ ప్రారంభించనున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు అభివృద్ధి అన్న పదాన్ని రాష్ట్ర ప్రజలు పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. సాగర్‌నగర్, రాజీవ్‌నగర్, వాడపాలెం, చిన్న రుషికొండ, పెద్దరుషికొండ, తిమ్మాపురం, వికలాంగుల కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రతిపాదించిన 14 అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికార్లను ఆదేశించారు.సాగర్‌నగర్ ఏఎమ్ఐజీ-డీ, ఎల్ఐజీ-సీ, గృహసముదాయాల రహదారి అధ్వానంగా ఉన్నదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఇంజనీరింగ్ ఈఈకి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మూతబడిన సింహగిరి మెట్లమార్గం

సింహాచలం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సింహగిరి మెట్ల మార్గం గుండా రాకపోకలు దేవస్థానం అధికారులు నిలిపివేశారు. వర్షం నీరుతో పాటు మట్టి వస్తుండడంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా భక్తుల రాకపోకలపై నిషేధం విధిస్తూ కొండదిగువున, మెట్ల మార్గం వద్ద బారికేడ్లన ఏర్పాటు చేశారు.

టీడీపీ అధ్యక్ష పదవికి భారీ పోటీ

... 5వ పేజీ తరువాయి

తొలుత ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, గండి బాబ్జీ, సుధాకర్, దువ్వారపు రామారావు, మేయర్ పీలా శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలతో సమావేశమై పార్లమెంటు కమిటీ ఎన్నికపై చర్చించింది. అనంతరం ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పలువురి పేర్లు సూచించారు. తన పదవి రెండేళ్లు పూర్తికాలేదని పేర్కొంటూ మరోసారి అవకాశం ఇవ్వాలని గండి బాబ్జీ కోరారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్రంలో ఎక్కడా పదవి ఇవ్వలేదని, తనకు అవకాశం ఇవ్వాలని సీతంరాజు సుధాకర్ కోరారు. బీసీ వర్గానికి చెందిన దువ్వారపు రామారావు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా, కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ చోడే వెంకట పట్టాభి త్రిసభ్య కమిటీని దరఖాస్తు అందజేశారు. పట్టాభికి అవకాశం ఇవ్వాలని పలువురు కార్పొరేటర్లు, కొందరు ఎమ్మెల్యేలు కమిటీ సభ్యులను కోరినట్టు సమాచారం. తూర్పు నియోజకవర్గానికి చెందిన నేత కార్పొరేటర్లు సంతకాలు సేకరించారంటున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా పరిశీలకునిగా వెళ్లిన మహ్మద్ నజీర్ ఫోన్‌లో త్రిసభ్య కమిటీకి తన పేరు పరిశీలించాలని కోరగా ఆయనకు మద్దతుగా కొందరు నేతలు లేఖలు అందజేశారు. బీసీ వర్గానికి చెందిన తనకు గతంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, చివరి నిమిషంలో వేరొకరికి ఇచ్చారని, ఇప్పుడు అధ్యక్ష పదవికి తన పేరు పరిశీలనలోకి తీసుకోవాలని కోరుతూ కమిటీకి భీమిలి మాజీ మునిసిపల్ ఛైర్మన్, కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి దరఖాస్తు ఇచ్చారు. అధ్యక్ష పదవి రేస్ నుంచి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తప్పుకున్నారు. కాగా అందరి అభిప్రాయాలు తీసుకున్న కమిటీ నివేదికను అధినేతకు అందజేస్తామని జిల్లా నాయకులకు వెల్లడించింది.

సమర్థులకే పదవులు

... 5వ పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిపై ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు మొత్తం 34 మందితో కూడిన కార్యవర్గం, 17 అధ్యక్ష, కార్యదర్శులతో అనుబంధ కమిటీలు, 54 సాధికార సమితులకు కార్యవర్గాల ఎంపిక చేపట్టాల్సి ఉందన్నారు. ఆశావహుల దరఖాస్తులను అధినేతకు అందజేస్తామన్నారు. ఎంపిక బాధ్యత అధినేతదేనన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో సమర్థులకే అవకాశం ఇస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో అందరి అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిస్తామన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కుడిపూడి సత్తిబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు సీతంరాజు సుధాకర్, దువ్వారపు రామారావు, కోరాడ రాజబాబు, బండారు అప్పలనాయుడు, బొండా జగన్, మూర్తియాదవ్, లొడగల కృష్ణ, ఈతలపాక సుజాత, పుచ్చా విజయకుమార్, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చవితి సందడి

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ బుధవారం వినాయకచవితి పండుగ కావడంతో పూజకు అవసరమైన పత్రి, పండ్లు, కొబ్బరికాయలు, వినాయక ప్రతిమలు, ఇతర పూజా సామగ్రి కొనుగోలుకు ప్రజలు గొడుగులు వేసుకుని అధిక సంఖ్యలో మార్కెట్‌కు తరలివచ్చారు. పండ్లకు విపరీతమైన డిమాండ్ పెరగడంతో వ్యాపారులు కొబ్బరికాయ రూ. 40-50లు, 5 చామంతి పూలు రూ.50 లకు విక్రయించారు. ఒక అరటి ఆకు రూ.10లు, ఒక కొబ్బరిపువ్వు రూ.15లు ధర పలికాయి.

వినాయక ఉత్సవాలకు ఉచిత విద్యుత్

▸▸నిర్వాహకులకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 6 వరకు 11 రోజులు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. దసరా దుర్గా నవరాత్రులకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. వీటిని పందిళ్లలో విద్యుద్దీపాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. మూడు కిలోవాట్ల వరకు లోడ్ అనుమతిస్తారని, అంతకు మించి ఉపయోగిస్తే రెగ్యులర్ టారిఫ్ ప్రకారం చార్జీలు వసూలు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సంబంధిత జోన్‌లో విద్యుత్‌శాఖాధికారులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అసోసియేషన్ పేరు, ఉత్సవం నిర్వహించే సంస్థ పేరు, మండపం అడ్రస్, మొబైల్ నంబరు, విద్యుత్ లోడ్ అంచనా వివరాలు సమర్పించాలని, వాటిని సీఎండీ ఆమోదిస్తారన్నారు.

భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

కూడా జిల్లాలో వర్షాలుంటాయని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

నిండుకుండలా మేహాద్రిగెడ్డ

గోపాలపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. గత నెలాఖరు వరకూ 49 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర పెరిగింది. ఎగువ ప్రాంతంలో చెరువులు నిండి పెద్దమొత్తంలో వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 57.6 అడుగులకు చేరింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా 59 అడుగులకు సమీపిస్తే బుధవారం సాయంత్రం స్వల్పంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

బార్‌లకు కానరాని స్పందన

... 5వ పేజీ తరువాయి

తీసి దరఖాస్తుతోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులకు అందజేయాలి. దరఖాస్తులకు ఈనెల 26వ ఆఖరు తేదీగా ప్రకటించింది. వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడంతో దరఖాస్తులు అంతంతమాత్రంగానే అందాయి. జిల్లాలో 121 బార్‌లు ఉండగా 218 మంది ఆన్‌లైన్‌లో పేర్లు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. కానీ 42 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు అందాయి. మరో ఐదు బార్‌లకు ఒక్కొక్కటి అందింది. బార్‌లకు వేలం వేయాలంటే కనీసం నాలుగు దరఖాస్తులు తప్పనిసరని ప్రభుత్వం నిబంధన విధించింది. వ్యాపారుల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో గడువును మరో మూడు రోజులు పెంచింది.

వినాయక నిమజ్జనాలపై పోలీసులకు సీపీ సూచనలు



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భీమిలి గోస్తనీ సాగర సంగమ ప్రదేశాన్ని మంగళవారం రాత్రి నగర సీపీ శంఖబ్రత బాగ్చీ సందర్శించారు. ఏటా భీమిలి బీచ్‌లో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరుగుతుంటాయి. ఈనేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ మంగళవారం రాత్రి పదిగంటల సమయంలో సీపీ స్వయంగా ఈ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా తీరంలో బారికేడ్లను ఏర్పాటు చేయాలని, ఫ్లడ్ లైట్లను కూడా ఏర్పాటు చేయాని సూచించారు. తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లు, ప్లాస్టిక్ అడ్రసింగ్ సిస్టమ్ కూడా ఉండాలన్నారు. పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తు ఉండాలని, బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. తగరపువలస గోస్తనీ వంతెన వద్ద కూడా నిమజ్జనాలు చేస్తుంటారని తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు, ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, భీమిలి సీఐ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

తెలియకుండానే వార్డెన్ల నియామకాలను వీసీ పూర్తిచేశారు. అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియలోనూ ఇదే తరహాలో వ్యవహరించినట్టు ప్రిన్సిపాల్స్ పేర్కొంటున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియ ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో చేపట్టాలి. అందుకు విరుద్ధంగా చేపట్టినట్టు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు ప్రిన్సిపాల్స్ అసంతృప్తిని వెళ్లగక్కారు. రీసెర్చ్ స్కాలర్స్‌కు సంబంధించిన ఫైల్స్ ప్రిన్సిపాల్స్ కార్యాలయాల నుంచి వీసీ ఛాంబర్‌కు వెళుతుంటాయి. వాటిని క్లియర్ చేయకుండాపెండింగ్‌లో పెడుతున్నారని, ఇదంతా తమను అవమానించడమేనని ప్రిన్సిపాల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో ప్రిన్సిపాల్స్‌కు కొన్ని అధికారాలుంటాయని, వాటికి విఘాతం కలిగించేలా ప్రస్తుత వీసీ వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ బాటలో రాజీనామా చేయాలన్న యోచనలో ఇద్దరు ప్రిన్సిపాల్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

వర్సిటీ వర్గాల్లో ఆందోళన

ఏయూ ప్రస్తుతం శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోంది. ఈ సమయంలో నెలకొన్న పరిస్థితుల పట్ల ఉద్యోగులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వహణ సరిగా లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల మధ్య విబేధాలు పెరగడం ఇబ్బందికరంగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. వర్సిటీలో తలెత్తిన సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

జీఎంల చేతికి పలుగు, పార!

... 5వ పేజీ తరువాయి

శాతం ఉత్పత్తి చేస్తామని చెప్పిన ఆయన ప్లాంటును నష్టాల ఊబిలోకి నెడుతున్నారు.

ఐడీ కార్డు చూపిస్తేనే టీ, టిఫిన్లు

వారం క్రితం స్టీల్‌ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లన్నీ మూసివేయించారు. 25 వేల ఎకరాల్లో విస్తరించి, 20 వేల మంది పనిచేసే ప్రాంతంలో యాజమాన్యం నిర్వహిస్తున్న క్యాంటీన్లు 12 మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పనిచేస్తున్నాయి. వాటిలో కూడా సిబ్బందిని ఇటీవల తగ్గించేశారు. ఇప్పుడు ఆ క్యాంటీన్లలో ఐడీ కార్డు చూపిస్తే తప్ప టీ, టిఫిన్లు ఇవ్వడం లేదు. పొరపాటున ఒక విభాగం వారు మరో విభాగానికి వెళ్లి టీ అడిగితే లేదు పొమ్మంటున్నారు.

మూడు నెలల జీతం పెండింగ్

సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఉద్యోగుల హెచ్ఆర్ఏ కట్ చేశారు. ఇంక్రిమెంట్లు ఇవ్వలేదు. క్వార్టర్లలో ఉంటున్న వారికి ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌కు ఇప్పుడు యూనిట్‌కు రూ.8 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి నెల జీతంలో 70 శాతం మాత్రమే ఇస్తున్నారు. మొత్తం మూడు నెలల జీతం పెండింగ్‌లో ఉంది. రిటైరైన వారికి సెటిల్‌మెంట్ త్వరగా చేయడం లేదు.

కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పెద్దలను ఒప్పించి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం ఇప్పిస్తే...ఇక్కడ సవ్యంగా ప్లాంటును నడపాల్సిన ఉన్నతాధికారులు ఆందోళనలకు తావిచ్చేలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

విగ్రహం ఎత్తును బట్టి నిమజ్జన ప్రదేశాలు ఎంపిక

... 5వ పేజీ తరువాయి

వాహనాన్ని మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ద్వారా సర్టిపై చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. వన్‌టౌన్, టూటౌన్, ఫోర్త్ టౌన్, కంచరపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు అడుగులులోపు ఉన్న విగ్రహాలను గోకుల్‌పార్కు వద్ద, మూడు నుంచి ఐదు అడుగులలోపు విగ్రహాలను కోస్టల్ బ్యాటరీ వద్ద, ఐదు అడుగులు కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెదజాలారిపేట వద్ద నిమజ్జనం నిషేధించామన్నారు. ఎంవీపీ, ద్వారకా, ఆరిలోవ పోలీస్ స్టేషన్ల పరిధిలో అన్ని విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని విగ్రహాలను ఐటీ సెజ్ జంక్షన్‌లో సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు విజయనగరం జిల్లా నుంచి వచ్చే విగ్రహాలను భీమిలి లేదా మంగమారిపేట లేదా అన్నవరం వద్ద బీచ్‌లోగానీ, గోస్తనీ నదిలోగానీ నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, న్యూపోర్టు, మల్కాపురం పరిధిలోని విగ్రహాలను యారాడ బీచ్, అప్పికొండ బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని విగ్రహాలను పినగాడి చెరువు లేదంటే సరిపల్లిలోని శివాలయం చెరువు, రాంపురం చెరువులో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. వినాయక నిమజ్జనం సమయం, ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చడం నిషేధించామన్నారు. నిమజ్జనం రాత్రి 12 గంటలులోపే పూర్తిచేయాలని స్పష్టంచేశారు. నిమజ్జనం సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు హెల్మెట్ ధరించకపోయినా, మద్యం సేవించి వాహనాలను నడిపినా కేసులు నమోదుచేస్తామన్నారు. ఊరేగింపులో ఇతర వాహన చోదకులకు ఇబ్బంది కలిగించినా, మండపాల వద్ద విద్యుత్ వైర్లను వేలాడదీసినా, డీజేలతో ఇతరులకు అసౌకర్యం కలిగించినా కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు. ఏదైనా సహాయం కావాలన్నా, సమస్యలు ఉన్నా 7995095799 నంబర్‌కు లేదా 100,102కి ఫోన్ చేయాలని కోరారు.

పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



ఆరిలోవ : ఆదర్శనగర్‌లో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న టీడీపీ యువనేత వెలగపూడి ప్రతిపరుద్ర తదితరులు



ఎంవీపీ కాలనీ : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కాలుష్యనియంత్రణ మండలి సభ్యులు

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని టీడీపీ యువ నాయకుడు వెలగపూడి ప్రతాప రుద్ర పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం 10 వార్డు పరిధి ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పర్యావరణహితంగా పండుగ జరుపుకోవాలన్నదే అందరి అభిమతం కావాలన్నారు. సుమారు 1000 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమలో టీడీపీ 10 వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, బీజేపీ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, గుత్తుల సత్యనారాయణ, కాళ్ల అప్పలరాజు, సూనాడ అప్పలనాయడు, జనసేన నాయకులు బండిరాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజారులో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా మిట్టి వినాయకులను మంగళవారం పంపిణీ చేశారు. సుమారు అయిదు వందల మంది వినియోగదారులు, రైతులకు విగ్రహాలను అందించారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సభ్యుడు పంచకర్ల సందీప్, రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు పాల్గొన్నారు.

వేమన మందిరంలో...

సిరిపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ గణపతిని ప్రతీ ఒక్కరూ పూజించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం వేమన మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకం, పూల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. జీవీఎంసీ ఉద్యానవన విభాగం డైరెక్టర్ మూల దామోదర్‌తో కలిసి విగ్రహాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడుపోతుమహంతి నారాయణ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



ఆరిలోవ : కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు



ఎంవీపీ కాలనీలో పూజా సామగ్రిలో కొనుగోలుదారులు

చవితి సందడికి వర్షం దెబ్బ

» ఎడతెరిపి లేని వర్షంతో తగ్గిన కొనుగోలుదారుల తాకిడి » బేరాలు లేవంటూ దుకాణదారుల ఆవేదన

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దెబ్బకు వినాయక చవితి కోసం దుకాణాలు ఏర్పాటు చేసిన దుకాణదారులు ఆశించిన బేరాలు లేక ఉసూరుమన్నారు. బజార్లలో కొనుగోలుదారుల సందడి కనిపించకపోవడంతో దిగారు వ్యాపారులు కనిపించారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి పూజ రెండు రోజుల ముందు నుంచి బజార్లు కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఈ ఏడాది వర్షాలు పడుతుండడంతో సందడి కనిపించలేదని దుకాణదారులు వాపోయారు. మామిడి కొమ్ములు, కొబ్బరి కాయలు అరటిపండ్లుతో పాటు వివిధ పూజా సామగ్రి కొనే వారే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పూజా సామగ్రి దుకాణాలను ఏర్పాటు చేశామని, బేరాలు లేకపోవడంతో దిగులేస్తోందని పలువురు దుకాణదారులు అంటున్నారు.

కాగా, మంగళవారం ఉదయం అంతా వర్షం కురిసినా సాయంత్రానికి వాన తగ్గడంతో బజార్లలో కొనుగోలుదారుల సంఖ్య పెరిగింది.

ఎంవీపీ కాలనీలో...

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క నిరంతరాయంగా వర్షం పడుతూనే ఉంది. బజారుకు కూరగాయాలు, చవితి సామగ్రితో వచ్చిన రైతులు ఆందోళనతో ఉన్నారు. ఈ వర్షానికి వ్యాపారం పడిపోతుందనే ఆందోళనకు తగ్గట్టుగా ఉదయం పది వరకూ వినియోగదారుల రాక అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది చవితి తమకు నష్టం కలిగిస్తుందనే బాధ రైతుల మొహాల్లో కనిపించింది. ఎడ తెరిపిలేకుండా వర్షం కురుస్తున్నా, పది గంటల నుంచి వినియోగదారుల రాక మొదలయ్యింది. కొద్ది సేపటిలోనే రైతు బజారు కిక్కిరిసింది. వ్యాపారం పుంజుకుంది. బజారులోకి వెళ్లడానికి ఖాళీ లేక, చాలా మంది రైతు బజారు చుట్టూ రహదారి పక్కన చవితి సామగ్రితో ఏర్పాటైన దుకాణాల్లో కొనుక్కున్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్‌తో బజారు చుట్టూ రోడ్లు రద్దీగా మారాయి. వర్షం అడ్డుపడితే, చవితి ఆగుతుందా.. తగ్గేదేలే అన్నట్లుగా జనం తమ కొనుగోళ్ల కోసం గొడుగులు పట్టుకుని బజారుకు వచ్చారు. సాయంత్రం అయ్యేసరికి రైతుల మొహాలు విప్పారాయి.

నేడు రైతు బజార్ తెరిచే ఉంటుంది

ఎంవీపీ కాలనీ రైతు బజార్ బుధవారం తెరిచే ఉంటుందని ఎస్టేట్ అధికారి వరహాలు తెలిపారు. సాధారణంగా ప్రతి బుధవారం రైతు బజార్‌కు సెలవు. అయితే వినాయకచవితి కారణంగా కొనుగోలుదారుల సౌలభ్యం కోసం బజార్‌కు ఈ వారం సెలవును రద్దు చేశారు. కొనుగోలుదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని వరహాలు కోరారు. కాగా బుధవారం వినాయక చవితి సంబరాలను రైతు బజార్ ఆవరణలో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

నేలకొరిగిన వృక్షం

ఎడతెరిపి లేకుండా మంగళవారం కురిసిన వర్షం నేపథ్యంలో ఎంవీపీ మూడో సెక్టరులో ఓ వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జీవీఎంసీ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించారు.

గణేష్ మండపాలకు తప్పని ఇబ్బందులు

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత రెండు రోజులను ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లోని వినాయక మండపాలు తడిసి ముద్దయ్యాయి. పలు చోట్ల చిన్నారులు ఎంతో కష్ట పడి సరదాగా ఈ మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. గత పది రోజులుగా ఇదే పనిలో వారున్నారు. అయితే గత రెండు రోజులుగా వర్షాలు పడడంతో వారికి మండపాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పెదగదిలి సాలిపేటలో మండపాన్ని ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వర్షాలు పడడంతో వారు కొంత అసంతృప్తి లోనయ్యారు. మండపాల నిర్వహణలో స్థానికులు వారికి సహకరిస్తున్నారు.



తడిసి ముద్దయిన వినాయక మండపం

నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. ఒకేసారి 16,500 మంది నూతనంగా ఉద్యోగాలు పొందారని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం చివరి సమయంలో డీఎస్సీ ప్రకటించి మరోసారి మోసం చేసిందన్నారు. ఇప్పుడు కూడా న్యాయస్థానంలో కేసులు వేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని పేర్కొన్నారు. జగన్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తే, నేడు లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఆ తప్పులను సరిదిద్దుతూ, వ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు ఉండవన్నారు. కానీ ఎవరు తప్పు చేసినా, చట్టం తన పని చేస్తుందన్నారు.

నాడు-నేడు కార్యక్రమం మీద ఫిర్యాదులు వస్తే తగిన విచారణ చేయిస్తామని, మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు త్వరలోనే ఇచ్చేస్తామని, అలాగే తల్లికి వందనం పెండింగ్ బిల్లులు కూడా రూ 325 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రజావసరాలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి

» ఎండాడలో అగ్నిమాపక కేంద్రానికి హోం మంత్రి అనిత శంకుస్థాపన



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అనిత, పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

ఎండాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎండాడ మహిళా స్టేషన్ సమీపంలో మంగళవారం అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశామని, వీలైనంత త్వరగా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దివ్యాంగుల పింఛన్లపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. కార్యక్రమంలో అగ్నిమాపక విభాగం అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్ పోర్టర్‌లో జనన, మరణ రిజిస్ట్రేషనన్ల నమోదు తప్పనిసరి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని జనన, మరణ నమోదును అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు సీఆర్ఎస్ పోర్టల్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)లో నమోదు ప్రక్రియ తప్పనిసరిగా చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు ఇప్పటికే సీఆర్ఎస్ లాగిన్‌లో నమోదు అయ్యాయని, మిగిలిన వారు తప్పనిసరిగా ప్రభుత్వం కల్పించిన సీఆర్ఎస్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఈ ప్రక్రియ వల్ల జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు సేవలు అందించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. జననం, మరణం జరుగుతున్న ఆస్పత్రి, నర్సింగ్ హోమ్, క్లినిక్‌లు వారు సీఆర్ఎస్ పోర్టల్ యూజర్ ఐడీల కోసం తప్పనిసరిగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజా ఆరోగ్య విభాగంలో సంప్రదించి యూజర్ ఐడీలను పొందవలసినదిగా సూచించారు. పుట్టిన తేదీ నుంచి 15 సంవత్సరాల దాటిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంలో బిడ్డ పేరు నమోదు తప్పనిసరి అని చెప్పారు.

గీతం వర్సిటీలో విశాఖ సిటీ ఇన్నోవేషన్ క్లస్టర్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీభరత్

సాగర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు, పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తెచ్చి నూతన ఆవిష్కరణలను వ్యాపారాత్మకంగా మార్చడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), సెయింట్ సంస్థ సంయుక్తంగా విశాఖలోని వివిధ విద్యా సంస్థల్లో నెలకొల్పనున్న ఇన్నోవేషన్ క్లస్టర్‌ను మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విశాఖ ఎంపీ, విద్యాసంస్థల గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ సంఖ్య కంటే నాణ్యతా ప్రమాణాలకు ఇన్నోవేషన్ కేంద్రాలు చిరునామా కావాలని, విశాఖ క్లస్టర్ దేశానికే ఆదర్శం కావాలన్నారు. ఇన్నోవేషన్ కస్టర్‌ల నిర్వహణలో గీతం విశ్వవిద్యాలయం సహకారం అందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్‌సొసైటీ (ఏపీఐఎస్) సీఈవో ఎం.సూర్యతేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆవిష్కరణ ఆంధ్ర కార్యక్రమానికి యువత నుంచి అనూహ్య స్పందన లభించిందని 24 గంటల్లో 1.67 లక్షల మంది రిజిస్టర్ చేసుకోవడం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కిందన్నారు. ఏఐసీటీఈ ఇన్నోవేషన్ కేంద్రం అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ దీపన్‌కుమార్ సాహు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు స్టార్టప్‌లలో పనిచేస్తున్నా స్వయం గా స్టార్టప్‌లను ప్రారంభించినా వాటికి క్రెడిట్ ఇవ్వాలని మొత్తం ఉత్తీర్ణత శాతంలో మార్కు లు కలపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ విభాగం డైరెక్టర్ కృష్ణమోహనదేవి, వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ వికాస్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

భూలోకమాతకు పూజలు

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి నెలవారి పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో విశేషంగా అలంకరించారు. మహిళలు, కార్యవర్గ సభ్యులు, అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు

సినిమా గైడ్

● **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
● **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
● **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
● **యూనివర్సిటీ** : శ్రీకాంతి
● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 40, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 26, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 50, కంద 40, దేముడు చిక్కుడు 68, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236

మహిళా భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మహిళా ఎస్సై రూప

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు కాల్ చేయాలని, డయల్ 100కు కాల్ చేస్తే నిముషాల వ్యవధిలోనే సహాయం అందుతుందని మహిళా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూప సూచించారు. కృష్ణా కళాశాల మార్గంలోని అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం సింహాద్రి టీఎంటీ, విశాఖ సిటీ మహిళా పోలీసు స్టేషన్ సంయుక్త సారథ్యంలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఆదాయపు పన్ను కమిషనర్ వడ్డాది అప్పలరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ ఎంతో విలువైందని, ఈ సమయంలో విజ్ఞాన సముపార్జనపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తుంటారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని కోరారు. మహిళా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూప మాట్లాడుతూ మహిళా భద్రతపై అనేక చట్టాలు, పథకాలు, నివారణ చర్యలు అమల్లో ఉన్నాయని, ప్రభుత్వ చట్టాలతో పాటు మహిళలు తమ భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసులకు కాల్ చేయడం, ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులతో వెళ్తుండటం చేయాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సన్‌ఫ్లవర్ చారిటుబుల్ ట్రస్టు ఫౌండర్ ఎంఎన్ కుమారి, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, కందుకూరి శ్రీనివాసరెడ్డి, అలయన్స్ కళాశాల చైర్మన్ కొల్ల సతీష్‌కుమార్, డాక్టర్ బీఏఎన్ నంద, ఆర్.కిరీటికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మేయర్, జీవీఎంసీ కమిషనర్ చవితి శుభాకాంక్షలు

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ బుధవారం నిర్వహించే వినాయక చవితి సందర్భంగా ఘనములకు అధిపతి అయిన వినాయకుడిని పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని అందుకు నగర ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వినాయక చవితి పండుగను క్రమశిక్షణ, భక్తిశ్రద్ధలతో పర్యావరణ హిత రంగా నిర్వహించుకోవాలని సూచించారు. నగరంలో వినాయక మండపాల నిర్వాహకులు తగిన అనుమతులు, జాగ్రత్తలు తీసుకోవాల వారిరువురూ కోరారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఎమ్మెల్యే గంటా అభినందనలు

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. పట్టణంలో జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా ఆమె పని చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 45 మందిని ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేయగా, ఏపీ నుంచి టీచర్ శ్రీదేవి ఒక్కరే ఉండడం భీమిలికి గర్వకారణమని గంటా పేర్కొన్నారు. 'చదువుకునేందుకు రండి...దేశ సేవకు వెళ్లండి' అనే థీమ్‌తో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం ప్రశంసనీయమన్నారు. గతంలో విద్యాశాఖామంత్రిగా గంటా శ్రీనివాసరావు ఉన్నపుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నానని, ఆయన ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలిలో ఇపుడు పనిచేస్తున్నపుడు జాతీయ అవార్డు కూడా రావడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయురాలు శ్రీదేవి అన్నారు.

1,097 చవితి పందిళ్లకు అనుమతి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా 1,097 పందిళ్లకు అనుమతులను మంజూరు చేశామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సింగిల్ విండో క్లియరెన్స్ సెల్‌కు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, అనుమతులు ఇచ్చామన్నారు. కాలనీలు, రోడ్లపై అనుమతులు లేకుండా ఉత్సవాల నిర్వహణతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని, ఫలితంగా జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం వాటిల్లుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో ప్రణాళిక యుతంగా ఉత్సవాలు జరిపేలా సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. వినాయక చవితిని ప్రజలంతా సంతోషంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరుతూ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లలో పూజ చేసుకున్న వారు విగ్రహాలను ఒక తొట్టిలో నీరు పోసి నిమజ్జనం చేయాలని, పందిర్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను అదే కాలనీలో నీటి ట్యాంకర్ల ద్వారా నిమజ్జనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

» మద్ది గ్రామంలో మేళతాళాలతో సందడిగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపు

పద్మనాభం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణజన్మాష్టమి ముగింపు వేడుకలు సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మద్ది గ్రామంలో శ్రీకృషుడి విగ్రహం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈ గ్రామంలో ఈ నెల 16న స్వామివారి విగ్రహాన్ని నిలిపి 11 రోజుల పాటు ప్రతిరోజూ పూజాది కార్యక్రమాలు, నామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ ముగింపు సందర్భంగా ప్రత్యేక పల్లకీపై కృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని నిలిపి భారీ ఊరేగింపు, కోలాటం తదితర నృత్య ప్రదర్శనలతో ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, సంస్థ ప్రతినిధులు త్రినాథరావు, కృష్ణసూరప్పడు, పోలీసునాయుడు, సురేష్, శ్రీనివాస్, పైడన్న సంతోష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

» స్థానికులకు ఇబ్బంది లేకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలి
» గోకుల్‌పార్క్, ఎన్‌సీబీ, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ నిమజ్జనం స్పాట్స్
» రాత్రి 10లోపే నిమజ్జనాల స్థలానికి చేరుకోవాలి
» త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ పి.పైడయ్య



మద్దిలపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల సీఐ పి.పైడయ్య హెచ్చరించారు. స్నేహపూర్వక వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు జారీ చేసిన అనుమతి పత్రాలను గణేశ్ మండపాలలో ప్రదర్శించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడకుండా చాలా ఎత్తులో ఉండేలా నిర్వాహకులు చూడాలన్నారు. మండపాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్గనైజర్ల కమిటీదేనన్నారు. అంతేకాకుండా మండపాల పరిసర నివాసితులకు ఆటంకాలు, శబ్ద కాలుష్యం లేకుండా ఆర్గనైజర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. అర్ధరాత్రుళ్ల వరకూ సౌండ్ సిస్టం మోగితే చర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడం, రోడ్డుకు అడ్డంగా గుంపులుగా గుమిగూడి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రిళ్లు మండపాలకు రక్షణగా ఆర్గనైజర్లు ఎవరో ఒకర్ని పందిరి వద్ద నిద్రపోయే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే మండపాల వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాత్రి 10 గంటలలోపే నిమజ్జనం..

వినాయక విగ్రహాల నిమజ్జనంలో ఆర్గనైజర్లు ఎటువంటి అలసత్వం వహించకూడదని సీఐ పైడయ్య సూచించారు. అర్ధరాత్రి వరకూ నిమజ్జనాలు చేయడం ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నిర్వహకులు గుర్తించాలన్నారు. మండపాల నుంచి విగ్రహాలు రాత్రి 10 గంటల లోపే నిమజ్జన స్థలానికి చేరుకోవాలన్నారు. అర్ధరాత్రుళ్ల వరకూ ఊరేగింపులతో ప్రజలకు ఇబ్బంది కలిగించినట్టు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడుగు నుంచి మూడు అడుగుల వినాయక విగ్రహాలు గోకుల్‌పార్క్ వద్ద, 3 నుంచి 5 అడుగుల విగ్రహాలు ఎన్‌సీబీ, 5 అడుగులకు మించి విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ బీచ్‌లో ఏర్పాటు చేసిన పాయింట్ల వద్ద మాత్రమే నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు.

వర్షాలకు కూలిన దుకాణం గోడ



కూడిన దుకాణం గోడ

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని సారిపల్లి జంక్షన్‌లో ఉన్న సారిపల్లి అప్పారావు పాన్ షాపు గోడ నానిపోయి కూలిపోయింది. పురాతన ఈ దుకాణాన్ని ఇటీవలే యజమాని అప్పారావు రీ మోడల్ చేయించారు. అయితే పాతబడిన గోడలు నానిపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కూలిపోయింది. దుకాణానికి ఉత్తర వైపు ఉన్న గోడ పడిపోయింది. ఒక్క సారిగా పెద్ద శబ్దం రావడంతో దుకాణంలో ఉన్న యజమాని వృద్ధుడైన అప్పారావు భయాందోళనలకు గురయ్యారు. తర్వాత ప్రజలు గోడ పడిపోయిందని తెలుసుకొని ఆవేదనకు గురయ్యారు. పేదవాడినైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు సందర్శించి, వివరాలు సేకరించారు.

గణనాథుని ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

» ఉచిత విద్యుత్ ప్రకటనతో నిర్వాహకుల్లో జోష్

మురళీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఉత్సాహంపై వరుణుడు నీళ్లు జల్లినా వినాయక పూజను ఘనంగా చేయాలని యువత గట్టి సంకల్పం తీసుకుంది. మురళీనగర్, మాధవధార పరిసరాల్లో వినాయకచవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మాధవధార కళింగనగర్ బస్టాప్ దగ్గర 25 అడుగుల భారీ దశముఖ గణపతిని రూపుదిద్దినట్లు యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పూజా మండపాన్ని 48ఎ బస్ రూట్‌లోని 60 అడుగుల ప్రధాన రహదారిలోనే ఏర్పాటు చేశారు. సప్తాశ్వ రథంపై విఘ్నేశ్వరుడు నిల్చున్నట్లుగా పూజా ప్రతిమను కళాకారులు సిద్ధం చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార, బర్మాక్యాంప్, పాలిటెక్నిక్ కళాశాల దగ్గర నుంచి ఆర్అండ్‌బీ జంక్షన్ వరకు దాదాపు 45 మండపాలు వెలిశాయి. ఉత్సవాల నిర్వహణ కోసం అనుమతులు తీసుకున్న యువజన సంఘాలు ఏర్పాట్లను జోరుగా చేపడుతున్నాయి. ఉత్సవాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆనందోత్సాహాలతో నిర్వాహకులు జోరు వానలోనూ తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యుత్ లైటింగ్ అలంకరణలు, తీరైన డిజైన్లలో పూజా మండపాలు వెలుస్తున్నాయి. ప్రముఖులకు. స్థానిక పెద్దలకు ఇప్పటికే ఆహ్వానాలు అందించిన నిర్వాహకులు పంచరాత్రి, నవరాత్రి, మూడు రోజుల ఉత్సవాల కోసం ఐక్యంగా పనిచేస్తున్నారు. తొలి పండుగ కావడంతో వినాయకచవితి సందడితో వీధులన్నీ పిల్లలు, యువత, కాలనీ మహిళా సంఘాల్లో సమష్టితత్వానికి అద్దం పడుతున్నాయి. రోజు వారీ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సంతర్పణలకు పూజా కమిటీల సభ్యులు ప్రణాళిక రూపొందించుకున్నారు. వర్షం నిర్వాహకుల ఉత్సాహంపై నీళ్లు జల్లినా చవితి పూజా ఘడియల కోసం ఉత్సాహంగా వేచి చూస్తున్నారు.


కళింగనగర్ బస్టాప్ వద్ద పూజలందుకోనున్న సప్తాశ్వాల రథంపై దశముఖ వినాయకుడు

సన్నాహక శిబిరానికి భారత మహిళల క్రికెట్ జట్టు


జెమిమా రోడ్రిగిస్, క్రికెట్-2 స్మృతి మంధాన

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళల వరల్డ్ కప్ టోర్నీలో ఆడనున్న భారత మహిళల జట్టు విశాఖ చేరుకుని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సన్నాహక శిబిరంలో పాల్గొన్నారు. సెప్టెంబరు 30 నుంచి జరగనున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత మహిళలు, శ్రీలంక మహిళలతో తలపడనున్నారు. దీనిలో భాగంగా నగరానికి చేరుకున్న మహిళా క్రికెటర్లు సెప్టెంబరు 1 వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శిబిరంలో పాల్గొంటారు. మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కారణంగా సాధనకు ఆటంకం కలగడంతో హోటల్‌కే పరిమితమయ్యారు. బుధవారం నుంచి ఐదు రోజులు సాధన చేస్తారు. ఏసీఏ వీడీసీఏ స్టేడియం ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండగా భారత మహిళా క్రికెటర్లు అక్టోబరు 9న దక్షిణాఫ్రికాతో, 12న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లు ఆడతారు.


కంచరపాలెం మెట్టు వద్ద కొనుగోలుదారులతో రద్దీ


కిటకిటలాడుతున్న మర్రిపాలెం రహదారి

ఉదయం ఉసూరు.. సాయంత్రం హుషారు

» వర్షంతో ఆశ, నిరాశలుగా సాగిన వినాయక చవితి పూజాసామగ్రి క్రయ విక్రయాలు

మహారాణిపేట/మర్రిపాలెం/కంచరపాలెం/అల్లిపురం/సీతమ్మధార/అక్కయ్యపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో పూజాసామగ్రి క్రయ, విక్రయాలు మంగళవారం ఆశ, నిరాశల మధ్య సాగాయి. పగలంతా ఎడతెరిపిలేని వర్షంతో వెలవెలబోగా.. సాయంత్రం తెరిపి ఇవ్వడంతో పూర్ణామార్కెట్, మర్రిపాలెం, కంచరపాలెం, అల్లిపురం బజార్లు కిక్కిరిశాయి. జనం తాకిడితో ట్రాఫిక్ స్తంభించింది. ముందుకు కదల్లేక వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షంలో తడుస్తూనే పలుచోట్ల ప్రజలు మార్కెట్లకు వచ్చి పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. తమ ఆశలపై వరుణుడు నీళ్లు జల్లాడని, వ్యాపారం దెబ్బతిందని ఉసూరుమన్న వ్యాపారులు.. వర్షం సాకుతో ధరలు అమాంతం పెంచేశారు. తొలిపూజకు ఆటంకం కలగరాదన్న భావనతో ప్రజలు అధిక ధరల గురించి ఆలోచించకుండా అడిగిన మొత్తాన్ని సమర్పించుకుని కొనుగోళ్లు జరిపారు. వర్షం కారణంగా సాయంత్రం వరకు కొనుగోలుదారులు పూర్ణామార్కెట్‌లోకి అడుగు పెట్టలేకపోయారు. రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. కొన్నేళ్లుగా వినాయక చవితి ముందు ఇంతలా భారీవర్షం కురవలేదు. ముసురు ఉన్నా వ్యాపారాలకు ఇబ్బంది ఉండేది కాదు. వర్షం ఆగాక పూజసామగ్రి కొనుగోలుకు ఒక్కసారిగా ప్రజలు బయటకు రావడంతో మర్రిపాలెం మార్కెట్‌కు జనం పోటెత్తారు. అల్లిపురం, అచ్చయ్యమ్మపేట మార్కెట్లు కళకళలాడాయి. పర్యావరణ స్పృహతో ఈ ఏడాది ఎక్కువగా మట్టి బొమ్మలనే తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఎక్కడికక్కడ ఉచితంగా వీటిని పంపిణీ చేయడంతో విగ్రహాల అమ్మకందారులు లబోదిబోమన్నారు. వినాయక చతుర్థికి రెండు రోజుల ముందు నుంచే వ్యాపారులు పూజ సామగ్రి విక్రయాలు ప్రారంభిస్తారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో విక్రయాలు జరగక వ్యాపారులు డీలా పడిపోయారు. మంగళవారం ఉదయం పరిస్థితి చూసి తీవ్ర ఆందోళన చెందారు. సాయంత్రం వాతావరణం మారిపోవడంతో కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

చిత్తడిగా రైతుబజార్లు

ఎడతెరిపిలేని వర్షం కారణంగా సీతమ్మధార, నరసింహనగర్ రైతుబజార్లు చిత్తడిగా మారాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన పత్రితో మార్కెట్లు నిండిపోయాయి. వర్షపునీటితోపాటు ఆకులు, పత్రి, పూల రెక్కలు కిందపడడంతో మార్కెట్లలో చిందర వందరగా పరిస్థితి కనిపించింది. వర్షంలో తడుచుకుంటూ వచ్చిన ప్రజలు రైతుబజార్లలో వాననీటి నిల్వతో ఇబ్బందులు పడ్డారు. పూజా సామగ్రి, పండ్ల ధరలు చుక్కలు తాకాయి.

రోడ్లు జలమయం

కుండపోతగా కురిసిన వర్షాలకు అక్కయ్యపాలెంలోని వివిధ ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు పాదచారులపై తుళ్లడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, నాలుగు లేన్ల రహదారి, దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు నిండిపోయాయి.

కవాచ్ లోకోమోటివ్ ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు అత్యాధునిక సాంకేతికతతో విశాఖలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్ సిద్ధం చేసిన తొలి కవాచ్ లోకోమోటివ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా మంగళవారం ప్రారంభించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సిగ్నల్ పాసింగ్ ప్రమాద ఘటనలు జరగకుండా రక్షణగా నిలిచే కవాచ్ లోకోమోటివ్‌ను ఎలక్ట్రికల్ లోకోషెడ్ నుంచి ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు.

వ్యాపారులు మార్పులను అందిపుచ్చుకోవాలి

మహారాణిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద సంస్కరణ జీఎస్టీ అని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ అన్నారు, మంగళవారం దసపల్లాలో జీఎస్టీ చెల్లింపుదారులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ జీఎస్టీపై అవగాహన నిరంతర ప్రక్రియ అని, వ్యాపారులు మార్పులకు అనుగుణంగా నడుచుకోవటం చాలా అవసరమన్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ వై.గీతా మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలకు పారదర్శకత కోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు.

‘బలమైన జట్టుతో బరిలోకి దిగుతున్నాం’

విశాఖపట్నం స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ప్రారంభం కానున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12లో తెలుగు టైటాన్స్ బలమైన జట్టుతో బరిలోకి దిగుతుందని సీఈవో త్రినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన రైడర్స్, డిఫెన్స్, ఆల్ రౌండర్లతో జట్టు పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్లే ఆఫ్‌కు చేరే ఆరు జట్లలో తెలుగు టైటాన్స్ ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖలో తెలుగు టైటాన్స్‌కు క్రీడాభిమానుల నుంచి మునుపటి మాదిరిగా విశేష ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. తొలి అంచె లీగ్‌లో తెలుగు టైటాన్స్ ఐదు మ్యాచ్‌లు ఆడనుందని తెలిపారు. జట్టు కెప్టెన్ విజయ్ మాలిక్ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించి తగిన వ్యూహాలతో బరిలోకి దిగుతామన్నారు. జట్టు కోచ్ కృష్ణకుమార్ హుండా మాట్లాడుతూ ఆటగాళ్లు గాయాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. తెలుగు టైటాన్స్ ఆడే ఐదు మ్యాచ్‌ల షెడ్యూల్‌తోపాటు జట్టు సభ్యుల వివరాలను సీఈవో త్రినాథ్‌రెడ్డి ప్రకటించారు.

భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

కూడా జిల్లాలో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

నిండుకుండలా మేహాద్రిగెడ్డ

గోపాలపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. గత నెలాఖరు వరకూ 49 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర పెరిగింది. ఎగువ ప్రాంతంలో చెరువులు నిండి పెద్దమొత్తంలో వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 57.6 అడుగులకు చేరింది. ప్రస్తుతం నీటిమట్టం స్థిరంగా ఉందని సిబ్బంది తెలిపారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా 59 అడుగులకు సమీపిస్తే బుధవారం సాయంత్రం స్వల్పంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

బార్‌లకు కానరాని స్పందన

... 5వ పేజీ తరువాయి

తీసి దరఖాస్తుతోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులకు అందజేయాలి. దరఖాస్తులకు ఈనెల 26వ ఆఖరు తేదీగా ప్రకటించింది. అయితే వ్యాపారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో దరఖాస్తులు అంతంతమాత్రంగానే అందాయి. మంగళవారం నాటికి జిల్లాలో 121 బార్‌లు ఉండగా 218 మంది ఆన్‌లైన్‌లో పేర్లు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. కానీ 42 బార్‌లకు మాత్రమే నాలుగేసి చొప్పున దరఖాస్తులు అందాయి. మరో ఐదు బార్‌లకు ఒక్కొక్క దరఖాస్తు అందింది. అయితే బార్‌లకు వేలం వేయాలంటే కనీసం నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాల్సివుంటుందని ప్రభుత్వం నిబంధన విధించింది. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే మాత్రం వాటిని లాటరీ తీయడానికి పరిగణనలోకి తీసుకోరు. బార్‌లకు వ్యాపారుల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో గడువును మరో మూడు రోజులు పెంచింది. దీంతో గురు, శుక్రవారాల్లో మిగిలిన బార్లకు దరఖాస్తులు అందుతాయని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

విగ్రహం ఎత్తును బట్టి నిమజ్జన ప్రదేశాలు ఎంపిక

... 5వ పేజీ తరువాయి

వాహనాన్ని మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ద్వారా సర్టిఫై చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. వన్‌టౌన్, టూటౌన్, ఫోర్త్ టౌన్, కంచరపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు అడుగులులోపు ఉన్న విగ్రహాలను గోకుల్‌పార్కు వద్ద, మూడు నుంచి ఐదు అడుగులలోపు విగ్రహాలను కోస్టల్ బ్యాటరీ వద్ద, ఐదు అడుగులు కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెదజాలారిపేట వద్ద నిమజ్జనం నిషేధించామన్నారు. ఎంవీపీ, ద్వారకా, ఆరిలోవ పోలీస్ స్టేషన్ల పరిధిలో అన్ని విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని విగ్రహాలను ఐటీ సెజ్ జంక్షన్‌లో సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు విజయనగరం జిల్లా నుంచి వచ్చే విగ్రహాలను భీమిలి లేదా మంగమారిపేట లేదా అన్నవరం వద్ద బీచ్‌లోగానీ, గోస్తనీ నదిలోగానీ నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, న్యూపోర్టు, మల్కాపురం పరిధిలోని విగ్రహాలను యారాడ బీచ్, అప్పికొండ బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని విగ్రహాలను పినగాడి చెరువు లేదంటే సరిపల్లిలోని శివాలయం చెరువు, రాంపురం చెరువులో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. వినాయక నిమజ్జనం సమయంలోగానీ, ఊరేగింపు సమయంలోగానీ బాణాసంచా కాల్చడం నిషేధించామన్నారు. అలాగే విగ్రహాల నిమజ్జనం రాత్రి 12 గంటలులోపే పూర్తిచేయాలని స్పష్టంచేశారు. నిమజ్జనం సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు హెల్మెట్ ధరించకపోయినా, మద్యం సేవించి వాహనాలను నడిపినా కేసులు నమోదుచేస్తామన్నారు. ఊరేగింపు సమయంలో ఇతర వాహన చోదకులకు ఇబ్బంది కలిగించినా, మండపాల వద్ద విద్యుత్ వైర్లను ఇతరులకు తగిలేలా వేలాడదీసినా, డీజేలతో ఇతరులకు అసౌకర్యం కలిగించినా కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు. ఏదైనా సహాయం కావాలన్నా, సమస్యలు ఉన్నా 7995095799 నంబర్‌కు లేదా 100,102కి ఫోన్ చేయాలని కోరారు.

వినాయక ఉత్సవాలకు ఉచిత విద్యుత్

» నిర్వాహకులకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 6 వరకు 11 రోజులు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. దసరా దుర్గా నవరాత్రులకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. వీటిని పందిళ్లలో విద్యుద్దీపాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. మూడు కిలోవాట్ల వరకు లోడ్ అనుమతిస్తారని, అంతకు మించి ఉపయోగిస్తే రెగ్యులర్ టారిఫ్ ప్రకారం చార్జీలు వసూలు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సంబంధిత జోన్‌లో విద్యుత్‌శాఖాధికారులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అసోసియేషన్ పేరు, ఉత్సవం నిర్వహించే సంస్థ పేరు, మండపం అడ్రస్, మొబైల్ నంబరు, విద్యుత్ లోడ్ అంచనా వివరాలు సమర్పించాలని, వాటిని సీఎండీ ఆమోదిస్తారన్నారు.

జీఎంల చేతికి పలుగు, పార!

... 5వ పేజీ తరువాయి

శాతం ఉత్పత్తి చేస్తామని చెప్పిన ఆయన ప్లాంటును నష్టాల ఊబిలోకి నెడుతున్నారు.

ఐడీ కార్డు చూపిస్తేనే టీ, టిఫిన్లు

వారం క్రితం స్టీల్‌ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లన్నీ మూసివేయించారు. 25 వేల ఎకరాల్లో విస్తరించి, 20 వేల మంది పనిచేసే ప్రాంతంలో యాజమాన్యం నిర్వహిస్తున్న క్యాంటీన్లు 12 మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పనిచేస్తున్నాయి. వాటిలో కూడా సిబ్బందిని ఇటీవల తగ్గించేశారు. ఇప్పుడు ఆ క్యాంటీన్లలో ఐడీ కార్డు చూపిస్తే తప్ప టీ, టిఫిన్లు ఇవ్వడం లేదు. పొరపాటున ఒక విభాగం వారు మరో విభాగానికి వెళ్లి టీ అడిగితే లేదు పొమ్మంటున్నారు.

మూడు నెలల జీతం పెండింగ్

సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఉద్యోగుల హెచ్‌ఆర్ఏ కట్ చేశారు. ఇంక్రిమెంట్లు ఇవ్వడం మానేశారు. క్వార్టర్లలో ఉంటున్న వారికి ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌కు ఇప్పుడు యూనిట్‌కు రూ.8 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి నెల జీతంలో 70 శాతం మాత్రమే ఇస్తున్నారు. 30 శాతం కోత పెడుతున్నారు. అలా మొత్తం మూడు నెలల జీతం పెండింగ్‌లో ఉంది. రిటైరైన వారికి సెటిల్‌మెంట్ త్వరగా చేయడం లేదు.

కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పెద్దలను ఒప్పించి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం ఇప్పిస్తే..ఇక్కడ సవ్యంగా ప్లాంటును నడపాల్సిన ఉన్నతాధికారులు ఆందోళనలకు తావిచ్చేలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమర్థులకే పదవులు

... 5వ పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిపై ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు మొత్తం 34 మందితో కూడిన కార్యవర్గం, 17 అధ్యక్ష, కార్యదర్శులతో అనుబంధ కమిటీలు, 54 సాధికార సమితులకు కార్యవర్గాల ఎంపిక చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా కార్యవర్గ ఎంపికకు సంబంధించి ఆశావహులు ఇచ్చిన దరఖాస్తులను అధినేతకు అందజేస్తామన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యవర్గం ఎంపిక బాధ్యత అధినేతదేనన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో సమర్థులకే అవకాశం ఇస్తామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పదవుల పంపకంలో సమ న్యాయం పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో అందరి అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిస్తామన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ పార్లమెంటు కార్యవర్గం ఎన్నికల్లో ఎంపీ శ్రీభరత్ అభిప్రాయాలకే మద్దతు ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా అధిష్ఠానం చూడాలన్నారు. పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కుడిపూడి సత్తిబాబు, ఇంకా సీతంరాజు సుధాకర్, దువ్వారపు రామారావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కోరాడ రాజబాబు, బండారు అప్పలనాయుడు, బొండా జగన్, మూర్తియాదవ్, లొడగల కృష్ణ, ఈతలపాక సుజాత, పుచ్చా విజయకుమార్, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

తెలియకుండానే వార్డెన్ల నియామకాలను వీసీ పూర్తి చేశారు. కొద్దిరోజుల కిందట చేపట్టిన అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియలోనూ ఇదే తరహాలో వీసీ వ్యవహ రించినట్టు ప్రిన్సిపాల్స్ పేర్కొంటున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియ ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో చేపట్టాలి. అందుకు విరుద్ధంగా వీసీ చేపట్టినట్టు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు ప్రిన్సిపాల్స్ అసంతృప్తిని వెళ్లగక్కారు. అలాగే, రీసెర్చ్ స్కాలర్స్‌కు సంబంధించిన ఫైల్స్ ప్రిన్సిపాల్స్ కార్యాలయాల నుంచి వీసీ ఛాంబర్‌కు వెళుతుంటాయి. వాటిని క్లియర్ చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని, ఇదంతా తమను అవమానించడమేనని ప్రిన్సిపాల్స్‌ను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో ప్రిన్సిపాల్స్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, వాటికి విఘాతం కలిగించేలా ప్రస్తుత వీసీ వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ బాటలో రాజీనామా చేయాలన్న యోచనలో ఇద్దరు ప్రిన్సిపాల్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

వర్సిటీ వర్గాల్లో ఆందోళన

ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రస్తుతం శతాబ్ది ఉత్స వాలను జరుపుకుంటోంది. ఇటువంటి సమయంలో వర్సిటీలో నెలకొన్న పరిస్థితుల పట్ల ఉద్యోగులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే శతాబ్ది ఉత్సవాల నిర్వహణ సరిగా లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల మధ్య విబేధాలు పెరగడం ఇబ్బందికరంగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. వర్సిటీలో తలెత్తిన సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ అధ్యక్ష పదవికి భారీ పోటీ

... 5వ పేజీ తరువాయి

తొలుత ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, గండి బాబ్జీ, సుధాకర్, దువ్వారపు రామారావు, మేయర్ పీలా శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలతో సమావేశమై పార్లమెంటు కమిటీ ఎన్నికపై చర్చించింది. అనంతరం ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పలువురి పేర్లు సూచించారు. అయితే ఎవరి పేర్లు సూచించారనేది బయటకు చెప్పలేదు. తన పదవి రెండేళ్లు పూర్తికాలేదని పేర్కొంటూ మరోసారి అవకాశం ఇవ్వాలని గండి బాబ్జీ కోరారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్రంలో ఎక్కడా పదవి ఇవ్వలేదని, అందువల్ల తనకు అవకాశం ఇవ్వాలని సీతంరాజు సుధాకర్ కోరారు. ఇంకా బీసీ వర్గానికి చెందిన దువ్వారపు రామారావు తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. కాగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ చోడే వెంకట పట్టాభి త్రిసభ్య కమిటీని దరఖాస్తు అందజేశారు. పట్టాభికి అవకాశం ఇవ్వాలని పలువురు కార్పొరేటర్లు, కొందరు ఎమ్మెల్యేలు కమిటీ సభ్యులను కోరినట్టు సమాచారం. ఇంకా పట్టాభి కోసం తూర్పు నియోజకవర్గానికి చెందిన నేత ఒకరు కార్పొరేటర్లు సంతకాలు సేకరించారంటున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా పరిశీలకునిగా వెళ్లిన మహ్మద్ నజీర్ ఫోన్‌లో త్రిసభ్య కమిటీకి తన పేరు పరిశీలించాలని కోరగా ఆయనకు మద్దతుగా కొందరు నేతలు లేఖలు అందజేశారు. బీసీ వర్గానికి చెందిన తనకు గతంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, అయితే చివరి నిమిషంలో వేరొకరికి ఇచ్చారని, ఇప్పుడు అధ్యక్ష పదవికి తన పేరు పరిశీలనలోకి తీసుకోవాలని కోరుతూ కమిటీకి భీమిలి మాజీ మునిసిపల్ చైర్మన్, వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి దరఖాస్తు ఇచ్చారు. అధ్యక్ష పదవి రేస్ నుంచి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తప్పుకున్నారు. కాగా అందరి అభిప్రాయాలు తీసుకున్న కమిటీ నివేదికను అధినేతకు అందజేస్తామని జిల్లా నాయకులకు వెల్లడించింది.

పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ


ఆరిలోవ : ఆదర్శనగర్‌లో మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న టీడీపీ యువనేత వెలగపూడి ప్రతిపరుద్ర తదితరులు


ఎంవీపీ కాలనీ : మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కాలుష్యనియంత్రణ మండలి సభ్యులు

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని టీడీపీ యువ నాయకుడు వెలగపూడి ప్రతాప రుద్ర పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం 10 వార్డు పరిధి ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీరాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పర్యావరణహితంగా పండుగ జరుపుకోవాలన్నదే అందరి అభిమతం కావాలన్నారు. సుమారు 1000 మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమలో టీడీపీ 10 వ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయడు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్, బీజేపీ వార్డు అధ్యక్షుడు దొంతల రమణ, గుత్తుల సత్యనారాయణ, కాళ్ల అప్పలరాజు, సూనాడ అప్పలనాయడు, జనసేన నాయకులు బండిరాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ రైతు బజారులో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా మిట్టి వినాయకులను మంగళవారం పంపిణీ చేశారు. సుమారు అయిదు వందల మంది వినియోగదారులు, రైతులకు విగ్రహాలను అందించారు. కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సభ్యుడు పంచకర్ల సందీప్, రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు పాల్గొన్నారు.

వేమన మందిరంలో...

సిరిపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ గణపతిని ప్రతీ ఒక్కరూ పూజించాలని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం వేమన మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకం, పూల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. జీవీఎంసీ ఉద్యానవన విభాగం డైరెక్టర్ మూల దామోదర్‌తో కలిసి విగ్రహాలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడుపోతుమహంతి నారాయణ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ఆరిలోవ : కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు


ఎంవీపీ కాలనీలో పూజా సామగ్రిలో కొనుగోలుదారులు

చవితి సందడికి వర్షం దెబ్బ

» ఎడతెరిపి లేని వర్షంతో తగ్గిన కొనుగోలుదారుల తాకిడి » బేరాలు లేవంటూ దుకాణదారుల ఆవేదన

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దెబ్బకు వినాయక చవితి కోసం దుకాణాలు ఏర్పాటు చేసిన దుకాణదారులు ఆశించిన బేరాలు లేక ఉసూరుమన్నారు. బజార్లలో కొనుగోలుదారుల సందడి కనిపించకపోవడంతో దిగారు వ్యాపారులు కనిపించారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి పూజ రెండు రోజుల ముందు నుంచి బజార్లు కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఈ ఏడాది వర్షాలు పడుతుండడంతో సందడి కనిపించలేదని దుకాణదారులు వాపోయారు. మామిడి కొమ్ములు, కొబ్బరి కాయలు అరటిపండ్లతో పాటు వివిధ పూజా సామగ్రి కొనే వారే కరువయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పూజా సామగ్రి దుకాణాలను ఏర్పాటు చేశామని, బేరాలు లేకపోవడంతో దిగులేస్తోందని పలువురు దుకాణదారులు అంటున్నారు.

కాగా, మంగళవారం ఉదయం అంతా వర్షం కురిసినా సాయంత్రానికి వాన తగ్గడంతో బజార్లలో కొనుగోలుదారుల సంఖ్య పెరిగింది.

ఎంవీపీ కాలనీలో...

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క నిరంతరాయంగా వర్షం పడుతూనే ఉంది. బజారుకు కూరగాయాలు, చవితి సామగ్రితో వచ్చిన రైతులు ఆందోళనతో ఉన్నారు. ఈ వర్షానికి వ్యాపారం పడిపోతుందనే ఆందోళనకు తగ్గట్టుగా ఉదయం పది వరకూ వినియోగదారుల రాక అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఏడాది చవితి తమకు నష్టం కలిగిస్తుందనే బాధ రైతుల మొహాల్లో కనిపించింది. ఎడ తెరిపిలేకుండా వర్షం కురుస్తున్నా, పది గంటల నుంచి వినియోగదారుల రాక మొదలయ్యింది. కొద్ది సేపటిలోనే రైతు బజారు కిక్కిరిసింది. వ్యాపారం పుంజుకుంది. బజారులోకి వెళ్లడానికి ఖాళీ లేక, చాలా మంది రైతు బజారు చుట్టూ రహదారి పక్కన చవితి సామగ్రితో ఏర్పాటైన దుకాణాల్లో కొనుక్కున్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్‌తో బజారు చుట్టూ రోడ్లు రద్దీగా మారాయి. వర్షం అడ్డుపడితే, చవితి ఆగుతుందా.. తగ్గేదేలే అన్నట్లుగా జనం తమ కొనుగోళ్ల కోసం గొడుగులు పట్టుకుని బజారుకు వచ్చారు. సాయంత్రం అయ్యేసరికి రైతుల మొహాలు విప్పారాయి.

నేడు రైతు బజార్ తెరిచే ఉంటుంది

ఎంవీపీ కాలనీ రైతు బజార్ బుధవారం తెరిచే ఉంటుందని ఎస్టేట్ అధికారి వరహాలు తెలిపారు. సాధారణంగా ప్రతి బుధవారం రైతు బజార్‌కు సెలవు. అయితే వినాయకచవితి కారణంగా కొనుగోలుదారుల సౌలభ్యం కోసం బజార్‌కు ఈ వారం సెలవును రద్దు చేశారు. కొనుగోలుదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని వరహాలు కోరారు. కాగా బుధవారం వినాయక చవితి సంబరాలను రైతు బజార్ ఆవరణలో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

నేలకొరిగిన వృక్షం

ఎడతెరిపి లేకుండా మంగళవారం కురిసిన వర్షం నేపథ్యంలో ఎంవీపీ మూడో సెక్టరులో ఓ వృక్షం నేలకొరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. జీవీఎంసీ సిబ్బంది చెట్టు కొమ్మలను తొలగించారు.

గణేష్ మండపాలకు తప్పని ఇబ్బందులు


తడిసి ముద్దయిన వినాయక మండపం

ఆరిలోవ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గత రెండు రోజులను ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లోని వినాయక మండపాలు తడిసి ముద్దయ్యాయి. పలు చోట్ల చిన్నారులు ఎంతో కష్ట పడి సరదాగా ఈ మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. గత పది రోజులుగా ఇదే పనిలో వారున్నారు. అయితే గత రెండు రోజులుగా వర్షాలు పడడంతో వారికి మండపాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. పెదగదిలి సాలిపేటలో మండపాన్ని ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. వర్షాలు పడడంతో వారు కొంత అసంతృప్తి లోనయ్యారు. మండపాల నిర్వహణలో స్థానికులు వారికి సహకరిస్తున్నారు.

నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



ఎంవీపీ కాలనీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని మెగా డీఎస్సీ నిర్వహించారన్నారు. ఒకేసారి 16,500 మంది నూతనంగా ఉద్యోగాలు పొందారని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం చివరి సమయంలో డీఎస్సీ ప్రకటించి మరోసారి మోసం చేసిందన్నారు. ఇప్పుడు కూడా న్యాయస్థానంలో కేసులు వేసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని పేర్కొన్నారు. జగన్ విద్యా వ్యవస్థను నాశనం చేస్తే, నేడు లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఆ తప్పులను సరిదిద్దుతూ, వ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు ఉండవన్నారు. కానీ ఎవరు తప్పు చేసినా, చట్టం తన పని చేస్తుందన్నారు.

నాడు-నేడు కార్యక్రమం మీద ఫిర్యాదులు వస్తే తగిన విచారణ చేయిస్తామని, మధ్యాహ్న భోజనం పెండింగ్ బిల్లులు త్వరలోనే ఇచ్చేస్తామని, అలాగే తల్లికి వందనం పెండింగ్ బిల్లులు కూడా రూ 325 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

ప్రజావసరాలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి

» ఎండాడలో అగ్నిమాపక కేంద్రానికి హోం మంత్రి అనిత శంకుస్థాపన


శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అనిత, పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

ఎండాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజావసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎండాడ మహిళా స్టేషన్ సమీపంలో మంగళవారం అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేశామని, వీలైనంత త్వరగా కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. దివ్యాంగుల పింఛన్లపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. కార్యక్రమంలో అగ్నిమాపక విభాగం అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్ పోర్టర్‌లో జనన, మరణ రిజిస్ట్రేషన్ల నమోదు తప్పనిసరి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని జనన, మరణ నమోదును అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు సీఆర్ఎస్ పోర్టల్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)లో నమోదు ప్రక్రియ తప్పనిసరిగా చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు ఇప్పటికే సీఆర్ఎస్ లాగిన్‌లో నమోదు అయ్యాయని, మిగిలిన వారు తప్పనిసరిగా ప్రభుత్వం కల్పించిన సీఆర్ఎస్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఈ ప్రక్రియ వల్ల జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు సేవలు అందించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. జననం, మరణం జరుగుతున్న ఆస్పత్రి, నర్సింగ్ హోమ్, క్లినిక్‌లు వారు సీఆర్ఎస్ పోర్టల్ యూజర్ ఐడీల కోసం తప్పనిసరిగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజా ఆరోగ్య విభాగంలో సంప్రదించి యూజర్ ఐడీలను పొందవలసినదిగా సూచించారు. పుట్టిన తేదీ నుంచి 15 సంవత్సరాల దాటిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంలో బిడ్డ పేరు నమోదు తప్పనిసరి అని చెప్పారు.

గీతం వర్సిటీలో విశాఖ సిటీ ఇన్నోవేషన్ క్లస్టర్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎం.శ్రీభరత్

సాగర్‌నగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు, పెట్టుబడిదారులను ఒకే వేదికపైకి తెచ్చి నూతన ఆవిష్కరణలను వ్యాపారాత్మకంగా మార్చడానికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ), సెయింట్ సంస్థ సంయుక్తంగా విశాఖలోని వివిధ విద్యా సంస్థల్లో నెలకొల్పనున్న ఇన్నోవేషన్ క్లస్టర్‌ను మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విశాఖ ఎంపీ, విద్యాసంస్థల గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ సంఖ్య కంటే నాణ్యతా ప్రమాణాలకు ఇన్నోవేషన్ కేంద్రాలు చిరునామా కావాలని, విశాఖ క్లస్టర్ దేశానికే ఆదర్శం కావాలన్నారు. ఇన్నోవేషన్ కస్టర్‌ల నిర్వహణలో గీతం విశ్వవిద్యాలయం సహకారం అందిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్‌సొసైటీ (ఏపీఐఎస్) సీఈవో ఎం.సూర్యతేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఆవిష్కరణ ఆంధ్ర కార్యక్రమానికి యువత నుంచి అనూహ్య స్పందన లభించిందని 24 గంటల్లో 1.67 లక్షల మంది రిజిస్టర్ చేసుకోవడం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులకు ఎక్కిందన్నారు. ఏఐసీటీఈ ఇన్నోవేషన్ కేంద్రం అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ దీపన్‌కుమార్ సాహు మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులు స్టార్టప్‌లలో పనిచేస్తున్నా స్వయం గా స్టార్టప్‌లను ప్రారంభించినా వాటికి క్రెడిట్ ఇవ్వాలని మొత్తం ఉత్తీర్ణత శాతంలో మార్కు లు కలపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ విభాగం డైరెక్టర్ కృష్ణమోహనదేవి, వీడీసీ డిప్యూటీ డైరెక్టర్ వికాస్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

భూలోకమాతకు పూజలు

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి నెలవారి పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పసుపుకొమ్ములతో విశేషంగా అలంకరించారు. మహిళలు, కార్యవర్గ సభ్యులు, అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

మహిళా భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న మహిళా ఎస్సై రూప

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు కాల్ చేయాలని, డయల్ 100కు కాల్ చేస్తే నిముషాల వ్యవధిలోనే సహాయం అందుతుందని మహిళా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూప సూచించారు. కృష్ణా కళాశాల మార్గంలోని అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం సింహాద్రి టీఎంటీ, విశాఖ సిటీ మహిళా పోలీసు స్టేషన్ సంయుక్త సారథ్యంలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఆదాయపు పన్ను కమిషనర్ వడ్డాది అప్పలరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ ఎంతో విలువైందని, ఈ సమయంలో విజ్ఞాన సముపార్జనపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తుంటారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని కోరారు. మహిళా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ యు.రూప మాట్లాడుతూ మహిళా భద్రతపై అనేక చట్టాలు, పథకాలు, నివారణ చర్యలు అమల్లో ఉన్నాయని, ప్రభుత్వ చట్టాలతో పాటు మహిళలు తమ భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే పోలీసులకు కాల్ చేయడం, ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులతో వెళ్తుండటం చేయాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సన్‌ఫ్లవర్ చారిటుబుల్ ట్రస్టు ఫౌండర్ ఎంఎస్ కుమారి, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, కందుకూరి శ్రీనివాసరెడ్డి, అలయన్స్ కళాశాల ఛైర్మన్ కొల్ల సతీష్‌కుమార్, డాక్టర్ బీఏఎస్ నంద, ఆర్.కిరీటికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు మేయర్, జీవీఎంసీ కమిషనర్ చవితి శుభాకాంక్షలు

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ మంగళవారం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ బుధవారం నిర్వహించే వినాయక చవితి సందర్భంగా ఘనములకు అధిపతి అయిన వినాయకుడిని పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని అందుకు నగర ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వినాయక చవితి పండుగను క్రమశిక్షణ, భక్తిశ్రద్ధలతో పర్యావరణ హిత రంగా నిర్వహించుకోవాలని సూచించారు. నగరంలో వినాయక మండపాల నిర్వాహకులు తగిన అనుమతులు, జాగ్రత్తలు తీసుకోవాల వారిరువురూ కోరారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఎమ్మెల్యే గంటా అభినందనలు

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మాదాబత్తుల తిరుమల శ్రీదేవిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. పట్టణంలో జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా ఆమె పని చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 45 మందిని ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేయగా, ఏపీ నుంచి టీచర్ శ్రీదేవి ఒక్కరే ఉండడం భీమిలికి గర్వకారణమని గంటా పేర్కొన్నారు. 'చదువుకునేందుకు రండి...దేశ సేవకు వెళ్లండి' అనే థీమ్‌తో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం ప్రశంసనీయమన్నారు. గతంలో విద్యాశాఖామంత్రిగా గంటా శ్రీనివాసరావు ఉన్నపుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నానని, ఆయన ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలిలో ఇపుడు పనిచేస్తున్నపుడు జాతీయ అవార్డు కూడా రావడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయురాలు శ్రీదేవి అన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 40, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 26, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడదుంపలు 50, కంద 40, దేముడు చిక్కుడు 68, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	226
స్కిన్‌లెస్	236

1,097 చవితి పందిళ్లకు అనుమతి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా 1,097 పందిళ్లకు అనుమతులను మంజూరు చేశామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. సింగిల్ విండో క్లియరెన్స్ సెల్‌కు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, అనుమతులు ఇచ్చామన్నారు. కాలనీలు, రోడ్లపై అనుమతులు లేకుండా ఉత్సవాల నిర్వహణతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని, ఫలితంగా జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం వాటిల్లుతున్నదన్నారు. ఈ నేపథ్యంలో ప్రణాళిక యుతంగా ఉత్సవాలు జరిపేలా సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. వినాయక చవితిని ప్రజలంతా సంతోషంగా, పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరుతూ కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు. ఇళ్లలో పూజ చేసుకున్న వారు విగ్రహాలను ఒక తొట్టిలో నీరు పోసి నిమజ్జనం చేయాలని, పందిర్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను అదే కాలనీలో నీటి ట్యాంకర్ల ద్వారా నిమజ్జనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

» మద్ది గ్రామంలో మేళతాళాలతో సందడిగా శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపు

పద్మనాభం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణజన్మాష్టమి ముగింపు వేడుకలు సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మద్ది గ్రామంలో శ్రీకృషుడి విగ్రహం ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈ గ్రామంలో ఈ నెల 16న స్వామివారి విగ్రహాన్ని నిలిపి 11 రోజుల పాటు ప్రతిరోజూ పూజాది కార్యక్రమాలు, నామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ ముగింపు సందర్భంగా ప్రత్యేక పల్లకీపై కృష్ణ పరమాత్ముడి విగ్రహాన్ని నిలిపి భారీ ఊరేగింపు, కోలాటం తదితర నృత్య ప్రదర్శనలతో ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు పాల్గొని శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గాడు వెంకటప్పడు, సంస్థ ప్రతినిధులు త్రినాథరావు, కృష్ణసూరప్పడు, పోలీసునాయుడు, సురేష్, శ్రీనివాస్, పైడన్న సంతోష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

» స్థానికులకు ఇబ్బంది లేకుండా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలి
» గోకుల్‌పార్క్, ఎన్‌సీబీ, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ నిమజ్జనం స్పాట్స్
» రాత్రి 10లోపే నిమజ్జనాల స్థలానికి చేరుకోవాలి
» త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ పి.పైడయ్య



మద్దిలపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ శాంతిభద్రతల సీఐ పి.పైడయ్య హెచ్చరించారు. స్నేహపూర్వక వాతవరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు జారీ చేసిన అనుమతి పత్రాలను గణేశ్ మండపాలలో ప్రదర్శించాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడకుండా చాలా ఎత్తులో ఉండేలా నిర్వాహకులు చూడాలన్నారు. మండపాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్గనైజర్ల కమిటీదేనన్నారు. అంతేకాకుండా మండపాల పరిసర నివాసితులకు ఆటంకాలు, శబ్ద కాలుష్యం లేకుండా ఆర్గనైజర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. అర్ధరాత్రుళ్ల వరకూ సౌండ్ సిస్టం మోగితే చర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడం, రోడ్డుకు అడ్డంగా గుంపులుగా గుమిగూడి రాకపోకలకు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రిళ్లు మండపాలకు రక్షణగా ఆర్గనైజర్లు ఎవరో ఒకర్ని పందిరి వద్ద నిద్రపోయే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే మండపాల వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాత్రి 10 గంటలలోపే నిమజ్జనం..

వినాయక విగ్రహాల నిమజ్జనంలో ఆర్గనైజర్లు ఎటువంటి అలసత్వం వహించకూడదని సీఐ పైడయ్య సూచించారు. అర్ధరాత్రి వరకూ నిమజ్జనాలు చేయడం ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని నిర్వహకులు గుర్తించాలన్నారు. మండపాల నుంచి విగ్రహాలు రాత్రి 10 గంటల లోపే నిమజ్జన స్థలానికి చేరుకోవాలన్నారు. అర్ధరాత్రుళ్ల వరకూ ఊరేగింపులతో ప్రజలకు ఇబ్బంది కలిగించినట్టు ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడుగు నుంచి మూడు అడుగుల వినాయక విగ్రహాలు గోకుల్‌పార్క్ వద్ద, 3 నుంచి 5 అడుగుల విగ్రహాలు ఎన్‌సీబీ, 5 అడుగులకు మించి విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ బీచ్‌లో ఏర్పాటు చేసిన పాయింట్ల వద్ద మాత్రమే నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు.

వర్షాలకు కూలిన దుకాణం గోడ


కూడిన దుకాణం గోడ

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని సారిపల్లి జంక్షన్‌లో ఉన్న సారిపల్లి అప్పారావు పాన్ షాపు గోడ నానిపోయి కూలిపోయింది. పురాతన ఈ దుకాణాన్ని ఇటీవలే యజమాని అప్పారావు రీ మోడల్ చేయించారు. అయితే పాతబడిన గోడలు నానిపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కూలిపోయింది. దుకాణానికి ఉత్తర వైపు ఉన్న గోడ పడిపోయింది. ఒక్క సారిగా పెద్ద శబ్దం రావడంతో దుకాణంలో ఉన్న యజమాని వృద్ధుడైన అప్పారావు భయాందోళనలకు గురయ్యారు. తర్వాత ప్రజలు గోడ పడిపోయిందని తెలుసుకొని ఆవేదనకు గురయ్యారు. పేదవాడినైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు సందర్శించి, వివరాలు సేకరించారు.

గణనాథుని ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

» ఉచిత విద్యుత్ ప్రకటనతో నిర్వాహకుల్లో జోష్



కళింగనగర్ బస్టాప్ వద్ద పూజలందుకోనున్న సప్తాశ్వాల రథంపై దశముఖ వినాయకుడు

మురళీనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఉత్సాహంపై వరుణుడు నీళ్ల జల్లినా వినాయక పూజను ఘనంగా చేయాలని యువత గట్టి సంకల్పం తీసుకుంది. మురళీనగర్, మాధవధార పరిసరాల్లో వినాయకచవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మాధవధార కళింగనగర్ బస్టాప్ దగ్గర 25 అడుగుల భారీ దశముఖ గణపతిని రూపుదిద్దినట్లు యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పూజా మండపాన్ని 48ఎ బస్ రూట్‌లోని 60 అడుగుల ప్రధాన రహదారిలోనే ఏర్పాటు చేశారు. సప్తాశ్వ రథంపై విఘ్నేశ్వరుడు నిల్చున్నట్లుగా పూజా ప్రతిమను కళాకారులు సిద్ధం చేశారు. ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార, బర్మాక్యాంప్, పాలిటెక్నిక్ కళాశాల దగ్గర నుంచి ఆర్‌అండ్‌బీ జంక్షన్ వరకు దాదాపు 45 మండపాలు వెలిశాయి. ఉత్సవాల నిర్వహణ కోసం అనుమతులు తీసుకున్న యువజన సంఘాలు ఏర్పాట్లను జోరుగా చేపడుతున్నాయి. ఉత్సవాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆనందోత్సాహాలతో నిర్వాహకులు జోరు వానలోనూ తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యుత్ లైటింగ్ అలంకరణలు, తీరైన డిజైన్లలో పూజా మండపాలు వెలుస్తున్నాయి. ప్రముఖులకు. స్థానిక పెద్దలకు ఇప్పటికే ఆహ్వానాలు అందించిన నిర్వాహకులు పంచరాత్రి, నవరాత్రి, మూడు రోజుల ఉత్సవాల కోసం ఐక్యంగా పనిచేస్తున్నారు. తొలి పండుగ కావడంతో వినాయకచవితి సందడితో వీధులన్నీ పిల్లలు, యువత, కాలనీ మహిళా సంఘాల్లో సమష్టితత్వానికి అద్దం పడుతున్నాయి. రోజు వారీ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సంతర్పణలకు పూజా కమిటీల సభ్యులు ప్రణాళిక రూపొందించుకున్నారు. వర్షం నిర్వాహకుల ఉత్సాహంపై నీళ్ల జల్లినా చవితి పూజా ఘడియల కోసం ఉత్సాహంగా వేచి చూస్తున్నారు.

సన్నాహక శిబిరానికి భారత మహిళల క్రికెట్ జట్టు



జెమిమా రోడ్రిగ్స్, క్రికెట్-2 స్మృతి మంధాన

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళల వరల్డ్ కప్ టోర్నీలో ఆడనున్న భారత మహిళల జట్టు విశాఖ చేరుకుని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సన్నాహక శిబిరంలో పాల్గొన్నారు. సెప్టెంబరు 30 నుంచి జరగనున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత మహిళలు, శ్రీలంక మహిళలతో తలపడనున్నారు. దీనిలో భాగంగా నగరానికి చేరుకున్న మహిళా క్రికెటర్లు సెప్టెంబరు 1 వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శిబిరంలో పాల్గొంటారు. మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కారణంగా సాధనకు ఆటంకం కలగడంతో హోటల్‌కే పరిమితమయ్యారు. బుధవారం నుంచి ఐదు రోజులు సాధన చేస్తారు. ఏసీఏ వీడీసీఏ స్టేడియం ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండగా భారత మహిళా క్రికెటర్లు అక్టోబరు 9న దక్షిణాఫ్రికాతో, 12న ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లు ఆడతారు.



కంచరపాలెం మెట్టు వద్ద కొనుగోలుదారులతో రద్దీ



కిటకిటలాడుతున్న మర్రిపాలెం రహదారి

ఉదయం ఉసూరు.. సాయంత్రం హుషారు

» వర్షంతో ఆశ, నిరాశలుగా సాగిన వినాయక చవితి పూజాసామగ్రి క్రయ విక్రయాలు

మహారాణిపేట/మర్రిపాలెం/కంచరపాలెం/అల్లిపురం/సీతమ్మధార/అక్కయ్యపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో పూజాసామగ్రి క్రయ, విక్రయాలు మంగళవారం ఆశ, నిరాశల మధ్య సాగాయి. పగలంతా ఎడతెరిపిలేని వర్షంతో వెలవెలబోగా.. సాయంత్రం తెరిపి ఇవ్వడంతో పూర్ణామార్కెట్, మర్రిపాలెం, కంచరపాలెం, అల్లిపురం బజార్లు కిక్కిరిశాయి. జనం తాకిడితో ట్రాఫిక్ స్తంభించింది. ముందుకు కదల్లేక వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షంలో తడుస్తూనే పలుచోట్ల ప్రజలు మార్కెట్లకు వచ్చి పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. తమ ఆశలపై వరుణుడు నీళ్లు జల్లాడని, వ్యాపారం దెబ్బతిందని ఉసూరుమన్న వ్యాపారులు.. వర్షం సాకుతో ధరలు అమాంతం పెంచేశారు. తొలిపూజకు ఆటంకం కలగరాదన్న భావనతో ప్రజలు అధిక ధరల గురించి ఆలోచించకుండా అడిగిన మొత్తాన్ని సమర్పించుకుని కొనుగోళ్లు జరిపారు. వర్షం కారణంగా సాయంత్రం వరకు కొనుగోలుదారులు పూర్ణామార్కెట్‌లోకి అడుగు పెట్టలేకపోయారు. రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. కొన్నేళ్లుగా వినాయక చవితి ముందు ఇంతలా భారీవర్షం కురవలేదు. ముసురు ఉన్నా వ్యాపారాలకు ఇబ్బంది ఉండేది కాదు. వర్షం ఆగాక పూజసామగ్రి కొనుగోలుకు ఒక్కసారిగా ప్రజలు బయటకు రావడంతో మర్రిపాలెం మార్కెట్‌కు జనం పోటెత్తారు. అల్లిపురం, అచ్చయ్యమ్మపేట మార్కెట్లు కళకళలాడాయి. పర్యావరణ స్పృహతో ఈ ఏడాది ఎక్కువగా మట్టి బొమ్మలనే తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఎక్కడికక్కడ ఉచితంగా వీటిని పంపిణీ చేయడంతో విగ్రహాల అమ్మకందారులు లబోదిబోమన్నారు. వినాయక చతుర్థికి రెండు రోజుల ముందు నుంచే వ్యాపారులు పూజ సామగ్రి విక్రయాలు ప్రారంభిస్తారు. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో విక్రయాలు జరగక వ్యాపారులు డీలా పడిపోయారు. మంగళవారం ఉదయం పరిస్థితి చూసి తీవ్ర ఆందోళన చెందారు. సాయంత్రం వాతావరణం మారిపోవడంతో కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడడంతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు.

చిత్తడిగా రైతుబజార్లు

ఎడతెరిపిలేని వర్షం కారణంగా సీతమ్మధార, నరసింహనగర్ రైతుబజార్లు చిత్తడిగా మారాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన పత్రితో మార్కెట్లు నిండిపోయాయి. వర్షపునీటితోపాటు ఆకులు, పత్రి, పూల రెక్కలు కిందపడడంతో మార్కెట్లలో చిందర వందరగా పరిస్థితి కనిపించింది. వర్షంలో తడుచుకుంటూ వచ్చిన ప్రజలు రైతుబజార్లలో వాననీటి నిల్వతో ఇబ్బందులు పడ్డారు. పూజా సామగ్రి, పండ్ల ధరలు చుక్కలు తాకాయి.

రోడ్లు జలమయం

కుండపోతగా కురిసిన వర్షాలకు అక్కయ్యపాలెంలోని వివిధ ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు పాదచారులపై తుళ్లడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, నాలుగు లేన్ల రహదారి, దొండపర్తి, రైల్వే న్యూకాలనీ, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు నిండిపోయాయి.

కవాచ్ లోకోమోటివ్ ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు అత్యాధునిక సాంకేతికతతో విశాఖలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్ సిద్ధం చేసిన తొలి కవాచ్ లోకోమోటివ్‌ను డీఆర్‌ఎం లలిత్ బొహ్రా మంగళవారం ప్రారంభించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సిగ్నల్ పాసింగ్ ప్రమాద ఘటనలు జరగకుండా రక్షణగా నిలిచే కవాచ్ లోకోమోటివ్‌ను ఎలక్ట్రికల్ లోకోషెడ్ నుంచి ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు.

వ్యాపారులు మార్పులను అందిపుచ్చుకోవాలి

మహారాణిపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద సంస్కరణ జీఎస్టీ అని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్సు మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ అన్నారు, మంగళవారం దసపల్లాలో జీఎస్టీ చెల్లింపుదారులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఐఆర్‌ఎస్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ జీఎస్టీపై అవగాహన నిరంతర ప్రక్రియ అని, వ్యాపారులు మార్పులకు అనుగుణంగా నడుచుకోవటం చాలా అవసరమన్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ వై.గీతా మాట్లాడుతూ మహిళా పారిశ్రామిక వేత్తలకు పారదర్శకత కోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు.

వినాయక ఉత్సవాలకు ఉచిత విద్యుత్

» నిర్వాహకులకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 6 వరకు 11 రోజులు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. దసరా దుర్గా నవరాత్రులకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. వీటిని పందిళ్లలో విద్యుద్దీపాల కోసం మాత్రమే ఉపయోగించాలన్నారు. మూడు కిలోవాట్ల వరకు లోడ్ అనుమతిస్తారని, అంతకు మించి ఉపయోగిస్తే రెగ్యులర్ టారిఫ్ ప్రకారం చార్జీలు వసూలు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సంబంధిత జోన్‌లో విద్యుత్‌శాఖాధికారులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అసోసియేషన్ పేరు, ఉత్సవం నిర్వహించే సంస్థ పేరు, మండపం అడ్రస్, మొబైల్ నంబరు, విద్యుత్ లోడ్ అంచనా వివరాలు సమర్పించాలని, వాటిని సీఎండీ ఆమోదిస్తారన్నారు.

జీఎంల చేతికి పలుగు, పార!

... 5వ పేజీ తరువాయి

శాతం ఉత్పత్తి చేస్తామని చెప్పిన ఆయన ప్లాంటును నష్టాల ఊబిలోకి నెడుతున్నారు.

ఐడీ కార్డు చూపిస్తేనే టీ, టిఫిన్లు

వారం క్రితం స్టీల్‌ప్లాంటులో ప్రైవేటు క్యాంటీన్లన్నీ మూసివేయించారు. 25 వేల ఎకరాల్లో విస్తరించి, 20 వేల మంది పనిచేసే ప్రాంతంలో యాజమాన్యం నిర్వహిస్తున్న క్యాంటీన్లు 12 మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పనిచేస్తున్నాయి. వాటిలో కూడా సిబ్బందిని ఇటీవల తగ్గించేశారు. ఇప్పుడు ఆ క్యాంటీన్లలో ఐడీ కార్డు చూపిస్తే తప్ప టీ, టిఫిన్లు ఇవ్వడం లేదు. పొరపాటున ఒక విభాగం వారు మరో విభాగానికి వెళ్లి టీ అడిగితే లేదు పొమ్మంటున్నారు.

మూడు నెలల జీతం పెండింగ్

సీఎండీగా సక్సేనా వచ్చిన తరువాత ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ కట్ చేశారు. ఇంక్రిమెంట్లు ఇవ్వడం మానేశారు. క్వార్టర్లలో ఉంటున్న వారికి ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌కు ఇప్పుడు యూనిట్‌కు రూ.8 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి నెల జీతంలో 70 శాతం మాత్రమే ఇస్తున్నారు. 30 శాతం కోత పెడుతున్నారు. అలా మొత్తం మూడు నెలల జీతం పెండింగ్‌లో ఉంది. రిటైరైన వారికి సెటిల్‌మెంట్ త్వరగా చేయడం లేదు.

కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పెద్దలను ఒప్పించి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయం ఇప్పిస్తే...ఇక్కడ సవ్యంగా ప్లాంటును నడపాల్సిన ఉన్నతాధికారులు ఆందోళనలకు తావిచ్చేలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమర్థులకే పదవులు

... 5వ పేజీ తరువాయి

పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిపై ఉంటుంన్నారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శితోపాటు మొత్తం 34 మందితో కూడిన కార్యవర్గం, 17 అధ్యక్ష, కార్యదర్శులతో అనుబంధ కమిటీలు, 54 సాధికార సమితులకు కార్యవర్గాల ఎంపిక చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లా కార్యవర్గ ఎంపికకు సంబంధించి ఆశావహులు ఇచ్చిన దరఖాస్తులను అధినేతకు అందజేస్తామన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యవర్గం ఎంపిక బాధ్యత అధినేతదేనన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో సమర్థులకే అవకాశం ఇస్తామన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పదవుల పంపకంలో సమ న్యాయం పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికల్లో అందరి అభిప్రాయాలు తీసుకుని అధినేతకు నివేదిస్తామన్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ పార్లమెంటు కార్యవర్గం ఎన్నికల్లో ఎంపీ శ్రీభరత్ అభిప్రాయాలకే మద్దతు ఇస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా అధిష్ఠానం చూడాలన్నారు. పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరిశీలకులు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, కుడిపూడి సత్తిబాబు, ఇంకా సీతంరాజు సుధాకర్, దువ్వారపు రామారావు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కోరాడ రాజబాబు, బండారు అప్పలనాయుడు, బొండా జగన్, మూర్తియాదవ్, లొడగల కృష్ణ, ఈతలపాక సుజాత, పుచ్చా విజయకుమార్, గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

తెలియకుండానే వార్డెన్ల నియామకాలను వీసీ పూర్తి చేశారు. కొద్దిరోజుల కిందట చేపట్టిన అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియలోనూ ఇదే తరహాలో వీసీ వ్యవహ రించినట్టు ప్రిన్సిపాల్స్ పేర్కొంటున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియ ప్రిన్సిపాల్స్ ఆధ్వర్యంలో చేపట్టాలి. అందుకు విరుద్ధంగా వీసీ చేపట్టినట్టు చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు ప్రిన్సిపాల్స్ అసంతృప్తిని వెళ్లగక్కారు. అలాగే, రీసెర్చ్ స్కాలర్స్‌కు సంబంధించిన ఫైల్స్ ప్రిన్సిపాల్స్ కార్యాలయాల నుంచి వీసీ ఛాంబర్‌కు వెళుతుంటాయి. వాటిని క్లియర్ చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని, ఇదంతా తమను అవమానించడమేనని ప్రిన్సిపాల్స్‌ను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో ప్రిన్సిపాల్స్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, వాటికి విఘాతం కలిగించేలా ప్రస్తుత వీసీ వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్ బాటలో రాజీనామా చేయాలన్న యోచనలో ఇద్దరు ప్రిన్సిపాల్స్ ఉన్నట్టు తెలుస్తోంది.

వర్సిటీ వర్గాల్లో ఆందోళన

ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రస్తుతం శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటోంది. ఇటువంటి సమయంలో వర్సిటీలో నెలకొన్న పరిస్థితుల పట్ల ఉద్యోగులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే శతాబ్ది ఉత్సవాల నిర్వహణ సరిగా లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల మధ్య విబేధాలు పెరగడం ఇబ్బందికరంగా మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. వర్సిటీలో తలెత్తిన సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ అధ్యక్ష పదవికి భారీ పోటీ

... 5వ పేజీ తరువాయి

తొలుత ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, గండి బాబ్జీ, సుధాకర్, దువ్వారపు రామారావు, మేయర్ పీలా శ్రీనివాస్, ఇతర ముఖ్య నేతలతో సమావేశమై పార్లమెంటు కమిటీ ఎన్నికపై చర్చించింది. అనంతరం ఒక్కొక్కరి నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పలువురి పేర్లు సూచించారు. అయితే ఎవరి పేర్లు సూచించారనేది బయటకు చెప్పలేదు. తన పదవి రెండేళ్లు పూర్తికాలేదని పేర్కొంటూ మరోసారి అవకాశం ఇవ్వాలని గండి బాబ్జీ కోరారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్రంలో ఎక్కడా పదవి ఇవ్వలేదని, అందువల్ల తనకు అవకాశం ఇవ్వాలని సీతంరాజు సుధాకర్ కోరారు. ఇంకా బీసీ వర్గానికి చెందిన దువ్వారపు రామారావు తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. కాగా జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న తనకు అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ చోడే వెంకట పట్టాభి త్రిసభ్య కమిటీని దరఖాస్తు అందజేశారు. పట్టాభికి అవకాశం ఇవ్వాలని పలువురు కార్పొరేటర్లు, కొందరు ఎమ్మెల్యేలు కమిటీ సభ్యులను కోరినట్టు సమాచారం. ఇంకా పట్టాభి కోసం తూర్పు నియోజకవర్గానికి చెందిన నేత ఒకరు కార్పొరేటర్లు సంతకాలు సేకరించారంటున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లా పరిశీలకునిగా వెళ్లిన మహ్మద్ నజీర్ ఫోన్‌లో త్రిసభ్య కమిటీకి తన పేరు పరిశీలించాలని కోరగా ఆయనకు మద్దతుగా కొందరు నేతలు లేఖలు అందజేశారు. బీసీ వర్గానికి చెందిన తనకు గతంలో ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి, అయితే చివరి నిమిషంలో వేరొకరికి ఇచ్చారని, ఇప్పుడు అధ్యక్ష పదవికి తన పేరు పరిశీలనలోకి తీసుకోవాలని కోరుతూ కమిటీకి భీమిలి మాజీ మునిసిపల్ చైర్మన్, వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి దరఖాస్తు ఇచ్చారు. అధ్యక్ష పదవి రేస్ నుంచి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తప్పుకున్నారు. కాగా అందరి అభిప్రాయాలు తీసుకున్న కమిటీ నివేదికను అధినేతకు అందజేస్తామని జిల్లా నాయకులకు వెల్లడించింది.



సత్తివానిపాలెం కూడలిలో దువ్వాడ వెళ్లే రహదారిలో చెరువు స్థలంలో ఆక్రమణలు



షీలానగర్‌కు వెళ్లే రోడ్డులో చెరువు స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు

ఆక్రమణలతో అంతరించిపోతున్న రేవళ్ల చెరువు

ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటున్న సత్తివానిపాలెం గ్రామస్తులు

నానాటికీ అధికమవుతున్న అక్రమ కట్టడాలు

గోపాలపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయల విలువ చేసే చెరువు స్థలం రోజురోజుకూ ఆక్రమణలతో అంతరించిపోతుందని సత్తివానిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోపోవడంతో చెరువు పరిసరాల్లో పుట్టగొడుగుల్లా ఆక్రమణలు వెలుస్తున్నాయి. 88వ వార్డు.. పెందుర్తి మండలం నరవ రెవెన్యూ పరిధిలోని సత్తివానిపాలెం గ్రామం సర్వే నంబర్ 352లో సుమారు 98 ఎకరాల విస్తీర్ణంలో రేవళ్ల చెరువు ఉంది. దశాబ్దాల క్రితం వ్యవసాయ అవసరాల కోసం ఈ చెరువును గ్రామస్తులు వినియోగించేవారు. నాలుగు దశాబ్దాల క్రితం సత్తివానిపాలెం గ్రామం నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ చెరువుకు ఆనుకుని ఉన్న కాలిబాట నుంచి రాకపోకలు సాగించేవారు. అయితే సత్తివానిపాలేనికి ఆనుకుని రెండున్నర దశాబ్దాల క్రితం వీఎస్ఈజడ్ ఏర్పడడంతో ఈ గ్రామం మీదుగా షీలానగర్‌కు, దువ్వాడకు రహదారులను నిర్మించారు.

ఈ రెండు రోడ్లను కూడా రేవళ్ల చెరువుకు చెందిన స్థలంలోనే నిర్మించారు. ఇదిలా ఉండగా చెరువు గర్భం పూడికతో నిండి పల్లపు భూమిలా మారడంతో గత ఐదేళ్లుగా సత్తివానిపాలెం కూడలిలో గల చెరువు స్థలంలో ఆక్రమణలు జోరందుకున్నాయి. ప్రస్తుతం సుమారు ఇరవై వరకు అక్రమ నిర్మాణాలు వెలశాయి. దీంతో చెరువు స్థలం ఆక్రమణలతో అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ గ్రామస్తులు గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు 'స్పందన'లో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. దీంతో తాజాగా మరికొన్ని అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు దృష్టిసారించి రేవళ్ల చెరువు స్థలంలోని ఆక్రమణలను తొలగించి చెరువు పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెట్రోల్ దొంగల హల్‌చల్

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెట్రోల్ దొంగలు చెలరేగిపోతున్నారు. క్వార్టర్స్ ముందు పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. దీంతో వాహనాలను పార్కింగ్ చేసేందుకు నివాసితులు హడలిపోతున్నారు. వేకువజాము మూడు గంటల నుంచి ఈ చోరీలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కొంతమంది యువకులు గుంపుగా వచ్చి వాహనాల నుంచి పెట్రోల్‌ను తస్కరిస్తున్నారని చెబుతున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు గస్తీని పటిష్ఠం చేయడంతో దొంగతనాలు తగ్గాయన్నారు. అయితే ఇటీవల కాలంలో మళ్లీ పెట్రోల్ దొంగలు చెలరేగిపోతున్నారని టౌన్‌షిప్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బైకు నుంచి పెట్రోల్ దొంగతనం చేసేందుకు బాటిల్ పెట్టిన దృశ్యం

నిబంధనలను అతిక్రమించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు

దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు



వర్షంలోనే ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటరావు

ఆటోనగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటో డ్రైవర్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు హెచ్చరించారు. దువ్వాడ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం వర్షంలో సైతం ఆయన ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించ రాదని, ఓవర్ లోడ్‌తో ప్రయాణం ప్రమాదకరమని, సైడ్ సిట్టింగ్‌ను పూర్తిగా నిషేధించాలని సూచించారు. అలాగే ఆటో డ్రైవర్లందరూ విధిగా యూనిఫామ్ ధరించాలని, తమ వాహనాల ఇన్సూరెన్స్ గడువు ముగియక ముందే రెన్యువల్ చేయించుకోవాలని సీఐ వెంకటరావు పేర్కొన్నారు. ముఖ్యంగా సీ-బుక్, లైసెన్స్, పొల్యూషన్ పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. వృద్ధులు, మహిళలు, విద్యార్థినుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. స్కూల్ ఆటోలపై తాము ప్రత్యేక నిఘా పెట్టామని, అందువల్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

పుస్తకాల బ్యాగులను ఆటోల పక్కకు వేలాడదీస్తున్నారని, విద్యార్థులను వెనుక సీట్లలో కూర్చోబెట్టుకుని ప్రమాదకరంగా కొందరు డ్రైవర్లు ప్రయాణిస్తున్నారని.. అటువంటి ఆటోలను గుర్తించి సీజ్ చేయడం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ లింగన్న దొర, సిబ్బంది పాల్గొన్నారు.

'బలమైన జట్టుతో బరిలోకి దిగుతున్నాం'

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ప్రారంభం కానున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-12లో తెలుగు టైటాన్స్ బలమైన జట్టుతో బరిలోకి దిగుతుందని సీఈవో త్రినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన రైడర్స్, డిఫెన్స్, ఆల్ రౌండర్లతో జట్టు పటిష్ఠంగా ఉందని పేర్కొన్నారు. ప్లే ఆఫ్‌కు చేరే ఆరు జట్లలో తెలుగు టైటాన్స్ ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖలో తెలుగు టైటాన్స్‌కు క్రీడాభిమానుల నుంచి మునుపటి మాదిరిగా విశేష ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. తొలి అంచె లీగ్‌లో తెలుగు టైటాన్స్ ఐదు మ్యాచ్‌లు ఆడనుందని తెలిపారు. జట్టు కెప్టెన్ విజయ్ మాలిక్ మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించి తగిన వ్యూహాలతో బరిలోకి దిగుతామన్నారు. జట్టు కోచ్ కృష్ణకుమార్ హుడా మాట్లాడుతూ ఆటగాళ్లు గాయాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. తెలుగు టైటాన్స్ ఆడే ఐదు మ్యాచ్‌ల షెడ్యూల్‌తోపాటు జట్టు సభ్యుల వివరాలను సీఈవో త్రినాథ్‌రెడ్డి ప్రకటించారు.

భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

కూడా జిల్లాలో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

నిండుకుండలా మేహాద్రిగెడ్డ

గోపాలపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. గత నెలాఖరు వరకూ 49 అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర పెరిగింది. ఎగువ ప్రాంతంలో చెరువులు నిండి పెద్దమొత్తంలో వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 57.6 అడుగులకు చేరింది. ప్రస్తుతం నీటిమట్టం స్థిరంగా ఉందని సిబ్బంది తెలిపారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 61 అడుగులు కాగా 59 అడుగులకు సమీపిస్తే బుధవారం సాయంత్రం స్వల్పంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

బార్‌లకు కానరాని స్పందన

... 5వ పేజీ తరువాయి

తీసి దరఖాస్తుతోపాటు ఎక్సైజ్ శాఖ అధికారులకు అందజేయాలి. దరఖాస్తులకు ఈనెల 26వ ఆఖరు తేదీగా ప్రకటించింది. అయితే వ్యాపారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో దరఖాస్తులు అంతంతమాత్రంగానే అందాయి. మంగళవారం నాటికి జిల్లాలో 121 బార్‌లు ఉండగా 218 మంది ఆన్‌లైన్‌లో పేర్లు ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. కానీ 42 బార్‌లకు మాత్రమే నాలుగేసి చొప్పున దరఖాస్తులు అందాయి. మరో ఐదు బార్‌లకు ఒక్కొక్క దరఖాస్తు అందింది. అయితే బార్‌లకు వేలం వేయాలంటే కనీసం నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాల్సివుంటుందని ప్రభుత్వం నిబంధన విధించింది. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే మాత్రం వాటిని లాటరీ తీయడానికి పరిగణనలోకి తీసుకోరు. బార్‌లకు వ్యాపారుల నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో గడువును మరో మూడు రోజులు పెంచింది. దీంతో గురు, శుక్రవారాల్లో మిగిలిన బార్లకు దరఖాస్తులు అందుతాయని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

విగ్రహం ఎత్తును బట్టి నిమజ్జన ప్రదేశాలు ఎంపిక

... 5వ పేజీ తరువాయి

వాహనాన్ని మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ద్వారా సర్టిపై చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. వన్‌టౌన్, టూటౌన్, ఫోర్త్ టౌన్, కంచరపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు అడుగులులోపు ఉన్న విగ్రహాలను గోకుల్‌పార్కు వద్ద, మూడు నుంచి ఐదు అడుగులలోపు విగ్రహాలను కోస్టల్ బ్యాటరీ వద్ద, ఐదు అడుగులు కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెదజాలారిపేట వద్ద నిమజ్జనం నిషేధించామన్నారు. ఎంవీపీ, ద్వారకా, ఆరిలోవ పోలీస్ స్టేషన్ల పరిధిలో అన్ని విగ్రహాలను జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ వద్ద బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని విగ్రహాలను ఐటీ సెజ్ జంక్షన్‌లో సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు విజయనగరం జిల్లా నుంచి వచ్చే విగ్రహాలను భీమిలి లేదా మంగమారిపేట లేదా అన్నవరం వద్ద బీచ్‌లోగానీ, గోస్తనీ నదిలోగానీ నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టు, న్యూపోర్టు, మల్కాపురం పరిధిలోని విగ్రహాలను యారాడ బీచ్, అప్పికొండ బీచ్‌లో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని విగ్రహాలను పినగాడి చెరువు లేదంటే సరిపల్లిలోని శివాలయం చెరువు, రాంపురం చెరువులో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. వినాయక నిమజ్జనం సమయంలోగానీ, ఊరేగింపు సమయంలోగానీ బాణాసంచా కాల్చడం నిషేధించామన్నారు. అలాగే విగ్రహాల నిమజ్జనం రాత్రి 12 గంటలులోపే పూర్తిచేయాలని స్పష్టంచేశారు. నిమజ్జనం సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు హెల్మెట్ ధరించకపోయినా, మద్యం సేవించి వాహనాలను నడిపినా కేసులు నమోదుచేస్తామన్నారు. ఊరేగింపు సమయంలో ఇతర వాహన చోదకులకు ఇబ్బంది కలిగించినా, మండపాల వద్ద విద్యుత్ వైర్లను ఇతరులకు తగిలేలా వేలాడదీసినా, డీజేలతో ఇతరులకు అసౌకర్యం కలిగించినా కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు. ఏదైనా సహాయం కావాలన్నా, సమస్యలు ఉన్నా 7995095799 నంబర్‌కు లేదా 100,102కి ఫోన్ చేయాలని కోరారు.


వర్షాలకు కూలిన గరుడాద్రి వేంకటేశ్వరాలయ ప్రహరీ


గాజువాక కణితి మార్గంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

తీవ్ర ఇబ్బందులకు గురైన పాదచారులు, ద్విచక్ర వాహనదారులు

పలు ప్రాంతాల్లో కూలిన గోడలు

గాజువాక, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో గాజువాక పరిసర ప్రాంతాల్లో మంగళవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. వినాయక ఉత్సవ నిర్వాహకులకు వర్షం ఆటంకం కలిగించింది. ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు డ్రైనేజీలు, పెద్ద కాలువల్లో వర్షపు నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు పారేలా తగిన చర్యలు చేపట్టారు.


పెందుర్తి శారదానగర్‌లో కూలిన గోడ

పొంగి ప్రవహించిన డ్రైనేజీ

అగనంపూడి: అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వేకువజాము 5 గంటల నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అగనంపూడి ఏరియా ఆస్పత్రి వద్ద డ్రైనేజీ పొంగి ప్రవహించింది. అలాగే అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే మార్గంలో స్థానిక కోళ్ల ఫారాల వద్ద రహదారి నీట మునిగింది. స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో పెద్దఎత్తున నీరు ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా రోజూవారీ కూలీలు, కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు.

శారదానగర్‌లో కూలిన గోడ

పెందుర్తి: రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెందుర్తి శారదానగర్‌లో నివాసం ఉంటున్న కళ్ల ఏసుబాబు అనే వ్యక్తి ఇంటి వెనుక హద్దులో ఉన్న మరో ఇంటి గోడ కూలి ఆయన నివాసంపై పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీనిపై బాధితుడు ఏసుబాబు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చినముషిడివాడలోని వుడా కాలనీ, వీరానగర్, చాణక్యనగర్, క్రాంతినగర్ కాలనీలు, పెందుర్తిలోని దొగ్గవానిపాలెం, సుజాతనగర్‌లోని నాగమల్లి లేఅవుట్ 80 అడుగుల రోడ్డు బురదమయం కావడంతో పాదచారులు, వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు.

కూలిన వేంకటేశ్వరాలయ ప్రహరీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి గరుడాద్రిపై గల శ్రీవేంకటేశ్వరాలయ ప్రహరీ మంగళవారం మధ్యాహ్నం కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి కొండ పైనుంచి నీరు వేగంగా కిందకు ప్రవహిస్తూ ఆలయ ప్రహరీని తాకుతుంది. దీంతో ప్రహరీ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి పూజలు జరుగుతున్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు.

ఇల్లు కూలి మహిళకు గాయాలు

సింధియా: రెండు రోజులుగా వర్షాలకు 62వ వార్డు దుర్గానగర్‌లో ఓ ఇల్లు కూలడంతో నివాసితురాలు వంజరపు సత్యవతి అనే మహిళ గాయపడింది. టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత మహిళకు ధైర్యం చెప్పి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గుడివాడ అప్పన్న కాలనీలో హెచ్‌టీ విద్యుత్ వైర్లు తెగిపడడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా మాలినాయుడు విద్యుత్ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు.


పూజా సామగ్రి కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గాజువాక మార్కెట్


కొనుగోలుదారులతో కిటకిటలాడుతుఉన్న గోపాలపట్నం ప్రధాన రహదారి

మార్కెట్లకు చవితి సందడి

పూజా సామగ్రి ధరలు

అధికమయ్యాయంటూ కొనుగోలుదారులు గగ్గోలు

గాజువాక, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ బుధవారం జరగనున్న దృష్ట్యా పూజా సామగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. మంగళవారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా పలువురు పూజా సామగ్రి కోసం మార్కెట్లకు రెయిన్ కోట్లు, గొడుగులు వేసుకుని మరీ వచ్చారు. సాయంత్రం ఐదు గంటల తరువాత వర్షం కాస్త తెరిపివ్వడంతో గాజువాక ప్రధాన మార్కెట్ కిటకిటలాడింది. ఈసారి పూజా సామగ్రి ధరలు బాగా పెరిగాయని, అయినా కొనుగోలు చేయక తప్పలేదని పలువురు కొనుగోలుదారులు వాపోయారు. కొత్త గాజువాక నుంచి పాత గాజువాక వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగించేందుకు సుమారు గంటన్నర సమయం పట్టిందంటే రద్దీ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఆకాశాన్నంటిన పండ్లు పువ్వుల ధరలు

వినాయక చవితి సందర్భంగా పండ్లు, పువ్వుల ధరలకు రెక్కలొచ్చాయి. చిన్నపాటి అరటిపండ్ల పెడను రూ.వంద నుంచి 150 రూపాయల మధ్య ధరల్లో విక్రయించారు. కొబ్బరికాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ.80, అరిటాకు ఒకటి రూ.20, యాపిల్ కిలో రూ.350, దానిమ్మ సైజును బట్టి కిలో రూ.300 నుంచి రూ.400 మధ్య ధరల్లో విక్రయించారు. అన్ని రకాల పండ్ల ధరలు భారీగానే ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

గోపాలపట్నంలో కిక్కిరిసిన బజార్లు

గోపాలపట్నం: వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనాలతో మంగళవారం సాయంత్రం బజార్లన్నీ కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం తెరిపివ్వకపోవడంతో బజార్లు కాస్త వెలవెలబోయాయి. సాయంత్రం నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో కొనుగోలుదారులు బజార్ల బాట పట్టారు. దీంతో గోపాలపట్నం బంక్ కూడలి నుంచి గోపాలపట్నం రైల్వే స్టేషన్ జంక్షన్ వరకు ప్రధాన రహదారి రద్దీగా కనిపించింది. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పండ్లు, పూల ధరలు అమాంతంగా పెరిగాయి.

సాహిత్య రంగానికి 'బుర్రి' సేవలు ప్రశంసనీయం

మల్కాపురం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు సాహిత్య రంగానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని కళారత్న అవార్డు గ్రహీత సుంకర చలపతిరావు అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుమార్‌రాజు సాహిత్య, సాంస్కృతిక, కళా, సేవా రంగాలను అందిస్తున్న సేవలను గుర్తించే విశ్వసాహితీ కళావేదిక ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమించిందన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా కో-ఆర్డినేటర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

79, 85 వార్డులను గాజువాక జోన్‌లోనే కొనసాగించాలని వినతి

అగనంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డులను గాజువాక జోన్‌లోనే కొసాగించాలని కోరుతూ నగరంలో ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావులను స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న 79, 85 వార్డులను పెందుర్తి జోన్‌లో కలపడం వల్ల కలిగే ఇబ్బందులను వారికి వివరించారు. 78, 79, 85 వార్డులకు అగనంపూడి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ ఈ ప్రాంతాన్ని గాజువాకలోనే కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ, మేయర్‌ను కలిసి వారిలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, బండారు చందూరమేశ్, కసిపల్లి శ్రీను, పలకా అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన

పెదగంట్యాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు మంగళవారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులు, పుస్తకాలు, సభ్యత్వం పొందిన పాఠకుల సంఖ్య, వారి నుంచి వసూలు చేసిన దరావత్తు వంటి వివరాలను పరిశీలించారు. గ్రంథాలయంలో అధికంగా సభ్యులను చేర్పించాలని గ్రంథాలయాధికారి పీవీ రమణకు సూచించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.

నేటి నుంచి సంపత్ వినాయక ఆలయంలో ఉత్సవాలు

అగనంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక సంపత్ వినాయక ఆలయంలో బుధవారం నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి మోటూరి వెంకటరమణ తెలిపారు. తొలిరోజు స్వామివారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు, గంధ బిళ్వార్చన, రజత కవచధారణ, కుంకుమ పుష్పార్చన, లక్ష్మీగణపతి హోమం, అన్న సమారాధన కార్యక్రమాలను చేపడతామన్నారు.

మదర్ థెరెసాకు నివాళి

అగనంపూడి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సత్రం కూడలిలో గల మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోబుల్ శాంతి అవార్డు గ్రహీత మదర్ థెరెసా జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సావిత్రి ముఖ్యఅతిథిగా విచ్చేసి మదర్ థెరెసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనాథలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిత్రా రామారావు, సాంబశివరావు, మోహన్, రామారావు, ముత్యాల అప్పారావు, చిత్రా జానకీదేవ్, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆస్పత్రిలో గల మదర్ థెరెసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రికి బెడ్ షీట్లు అందజేశారు.

29 నుంచి కబడ్డీ పోటీలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా లంకెలపాలెంలో ఈ నెల 29 నుంచి ఉత్తరాంధ్ర పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కోటీశ్వరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆర్‌బీఆర్ యూత్, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విద్యుద్దీప కాంతుల్లో జరిగే ఈ పోటీల్లో ఒకటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, 15 వేలు, రూ.10 వేల నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు 7680005666 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

3 కిలోల గంజాయి స్వాధీనం

పెందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో గుట్టుగా దాచిన 3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి రాతిచెరువుకు చెందిన పవడ శివకుమార్(22) అరకు నుంచి గంజాయి తెప్పించి ఇంట్లో చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నాడు. దీనిపై నిఘా పెట్టిన పోలీసులు మంగళవారం శివ కుమార్ గంజాయి ప్యాకెట్లను విక్రయించేందుకు సిద్ధపడుతుండగా అరెస్టు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
● **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
● **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 42, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 40, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 26, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 36, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 30, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 50, కంద 40, దేముడు చిక్కుడు 68 , గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	108
లైవ్ ధర	128
విత్ స్కిన్	222
స్కిన్‌లెస్	236

మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం

87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్

కూర్మన్నపాలెం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం-ప్రకృతిని కాపాడదామని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని తిరుమల నగర్‌లో మంగళవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి గణేశుని విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమేశ్వరరావు, పరమానందం, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, వసంత రెడ్డి, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే కూర్మన్నపాలెం వుడా నగర్ ఫేజ్-5లో సుమారు మూడు వేల మందికి లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ అధ్యక్షుడు లక్కరాజు సోంబాబు, పూర్వ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ మట్టి గణేశుని విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అవిరెడ్డి సూర్యనారాయణ, ప్రసాదనాయుడు, లక్ష్మారెడ్డి, కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: వినాయక చవితి పండుగ నాడు పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి గణేశుని ప్రతిమలనే పూజించాలని తెలుగు యువత గాజువాక అధ్యక్షుడు బలగ బాలునాయుడు అన్నారు. 73వ వార్డులో మంగళవారం మూడు వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో వేల సంఖ్యలో మట్టి గణేశుని విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దాడ సోమునాయుడు, దొమ్మేటి సోమునాయుడు, కె.అప్పలరాజు, బన అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న బొండా జగన్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం షీలానగర్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణేశుని ప్రతిమలను అందరూ పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పి.ఉమామహేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, ఎం.నగేశ్, శేషుబాబు, సూరిబాబు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. అలాగే షీలానగర్ అనురాధ పెట్రో సర్వీస్ సెంటర్ వద్ద సంస్థ చైర్మన్ యార్లగడ్డ వెంకన్నచౌదరి మట్టి వినాయక విగ్రహాలను సిబ్బందికి పంపిణీ చేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి కరాసలో టీడీపీ వార్డు అధ్యక్షుడు వై.తిరుమలరావు ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు గణేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


73వ వార్డులో మట్టి గణేశుని విగ్రహాలను పంపిణీ చేస్తున్న బలగ బాలునాయుడు



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం వుడా ఫేజ్-5లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పెందుర్తిలో కొలువుదీరనున్న 360 వినాయక విగ్రహాలు

11 రోజుల వరకే

చవితి ఉత్సవాలకు పోలీసుల అనుమతి

నిమజ్జనాల కోసం సరిపల్లి, పినగాడి, పాత పెందుర్తి, నరవ చెరువుల ఎంపిక

పెందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పెందుర్తి ప్రాంతంలో 360 గణేశుని విగ్రహాలు పలు ప్రాంతాల్లో కొలువుదీరనున్నాయి. ఈసారి పోలీసులు కఠిన నిబంధనలను అమలు చేయడంతో 11 రోజుల్లో చవితి ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ క్రమంలో పాత పెందుర్తి పెదచెరువు, సరిపల్లి పినచెరువు, పినగాడి పెంటవాని చెరువు, నరవ ఆవ చెరువులను వినాయక విగ్రహాల నిమజ్జనాల కోసం పోలీసులు ఎంపిక చేశారు. చినముషిడివాడలోని శారదాపీఠం సమీపంలో 18 అడుగుల ఎత్తుతో కూడిన గణనాథుని విగ్రహాన్ని నిర్వాహకులు ప్రతిష్ఠించనున్నారు. కాగా పెందుర్తిలోని మార్కెట్‌లో చవితి సందడి నెలకొంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి ప్రజలు మార్కెట్‌కు తరలిరావడంతో రద్దీ వాతావరణం చోటుచేసుకుంది. నిర్వాహకులందరూ ప్రశాంత వారణంలో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సీఐ కేవీ సతీశ్ కుమార్ సూచించారు.


పెందుర్తిలోని చెరువును పరిశీలిస్తున్న పోలీసులు

స్టీల్ ప్లాంటుకు ఎక్స్‌పోర్టు అవార్డు



మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉక్కు అధికారి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటుకు ప్రతిష్ఠాత్మకమైన ఎక్స్‌పోర్టు అవార్డు లభించింది. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా స్టీల్ ప్లాంట్ అధికారులు అవార్డు అందుకున్నారు. 2021-22, 2022-23 సంవత్సరాలకు గాను ఇనుప, ఉక్కులో లార్జ్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో అత్యుత్తమ ఎగుమతి పనితీరుకు గాను సౌత్ ఇండియా ఎక్స్‌పోర్టు అవార్డు సాధించింది.

నిత్యావసర సరకులు అందజేత

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) ఫౌండేషన్ డేను పురస్కరించుకుని ఉక్కునగరం యూనిట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. గాజువాకలోని ఓ అనాథాశ్రమంలో గల బాలలకు నిత్యావసర సరకులను అందజేశారు. మధ్యాహ్నం విద్యార్థులకు భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు ఆర్‌వీవీఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ నిజాయితీ

పెందుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తనకు దొరికిన పర్స్‌ను బాధితుడికి అందేలా చేసి తన నిజాయితీని చాటుకున్నారు పెందుర్తి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డీకేవీ స్వామి. వివరాలిలా ఉన్నాయి. పోలీస్ స్టేషన్ వెనక సీహెచ్‌సీ సమీప మార్గంలో ఓ పర్సును స్వామి చూశారు. అందులో రూ.5,200 నగదుతో సదరు వ్యక్తి వివరాల మేరకు బాధితుడు నాయుడుతోటకు చెందిన ఎస్.నాగమల్లేశ్వరరావుగా గుర్తించారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆదేశాలతో మంగళవారం స్టేషన్‌లో హెచ్‌సీ స్వామి చేతుల మీదుగా ఎస్ఐ భాస్కరరావు సమక్షంలో బాధితుడికి పర్సును అందజేశారు. స్వామి నిజాయితీని పోలీస్ సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ పథకాలను అర్హులందరూ వినియోగించుకోవాలి

69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. వార్డు పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, షీలానగర్ సచివాలయాల వద్ద మంగళవారం ఆయన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సంద్రాన భాస్కర్, వి.జీవన్‌బాబు, ఆనంద్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

అగనంపూడి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. పాత అగనంపూడిలో పలువురు లబ్ధిదారులకు ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కరణం జగదీశ్, కె.పైడిరాజు, జి.రుద్రకుమార్, జి.సూర్యనారాయణ, ఎస్.సింహాచలం, ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫార్మాసిటీ పునరావాస కాలనీలో 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

28 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

విశాలాక్షినగర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు నెల 28 నుంచి వైద్య పరీక్షలకు హాజరు కావాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా కోరారు. 4001020 నుంచి 4152205 హాల్ టికెట్ నంబర్లుగల అభ్యర్థులు 28న, 4152904 నుంచి 4275272 వరకు 29న, 4276418 నుంచి 4507457 వరకు 30న కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు గ్రౌండులో ఉదయం 7 గంటలకు హాజరుకావాలన్నారు.అనివార్య కారణాలతో హాజరుకాని వారు సెప్టెంబరు ఒకటోతేదీన రావాలన్నారు.

నేడు కిరండూల్ పాసింజర్ రైలు అరకు వరకే

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షం కారణంగా ముందస్తు జాగ్రత్తలో భాగంగా బుధవారం విశాఖ-కిరండూల్ మధ్య నడిచే పాసింజర్ రైళ్ల గమ్యాలను విశాఖ-అరకు మధ్య పరిమితం చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండూల్ పాసింజర్ రైలు (58501) అరకు వరకు, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖ పాసింజర్ రైలు (58502) అరకు నుంచి విశాఖ వరకు నడుస్తాయన్నారు. అరకు-కిరండూల్ మధ్య రాకపోకలను రద్దు చేశామని పేర్కొన్నారు.



అక్కయ్యపాలెం జాతీయ రహదారిపై నిలిచిన నీరు



వర్షం నీటితో నిండిపోయిన పూర్ణామార్కెట్ రోడ్డు



డివైడర్‌పై నుంచి పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

నగరంలో జోరు వాన

నగరంలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డా రు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వరద నీరు పొంగి ప్రవహించింది. పలు ప్రాంతాల్లో చెట్లు, నానిపోయిన గోడలు కూలిపోయాయి. సాయంత్రం వర్షం తగ్గుముఖం పట్టడంతో వినాయక చవితి సందడి ప్రారంభమయింది. మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరగడంతో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిండు కుండను తలపించింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



మురళీనగర్ జంక్షన్ వద్ద వర్షం



నిండుకుండలా కనిపిస్తున్న మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

చోరీ కేసులో ముద్దాయికి జైలు

భీమునిపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఆటో, మోటారు సైకిళ్ల దొంగతనం కేసుల్లో ముద్దాయి టేకుపూడి కనకరాజుకు జైలు శిక్ష విధిస్తూ భీమిలి 15వఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ పి.స్వాతిభవాని తీర్పు నిచ్చారని క్రైమ్ ఎస్‌ఐ సూర్య ప్రకాశ్ తెలిపారు. మంగమారిపేటకు చెందిన వాసుపల్లి అప్పలస్వామి ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ గత ఏడాది ఆగస్టు 30న చోరీకి గురయింది. సంగివలసలో చెళ్లూరి దేముడు బైక్ గత ఏడాది అక్టోబరు ఒకటిన, తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన రాము ఆటో అదే రోజున చోరీ అయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేయగా మధురవాడ మెట్టకు చెందిన టేకుపూడి కనకరాజును నిందితుడిగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో ఒక్కో కేసులో 14 నెలల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది అరెస్టు చేసి 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఈసమేతర ఖతన్, ఒడిశాకు చెందిన గీత నాయక్ ప్లాస్టిక్ క్రికెట్ బ్యాట్, సూట్‌కేసులో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు.

బాధిత మహిళలకు అండగా నిలవాలి

- జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్
- జనసువాయి పేరుతో జడ్పీలో వినతుల స్వీకరణ



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందార్, పాల్గొన్న అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి : వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలిచి సహకరించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ పేర్కొన్నారు. జనసువాయి పేరుతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె బాధిత మహిళల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఫిర్యాదులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలన, న్యాయపరమైన సేవలందించాలన్నారు. క్లిష్టమైన పరిస్థితుల్లో భరణం వచ్చేలా, స్వయం ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని, మనోధైర్యం కల్పించాలని సూచించారు. అపరిచితులు, కుటుంబ సభ్యుల నుంచి భౌతిక, మానసిక దాడుల నుంచి రక్షణ కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై మరింత చొరవ చూపాలన్నారు. వ్యక్తిగత, కుటుంబ కలహాలు, వరకట్న వేధింపులు, వంచన, భౌతిక దాడులు, మానసిక వేధింపులు, తప్పుడు రీతిలో మెసేజ్‌లు, దుర్భాషలు, భరణం చెల్లించకపోవడం, నగదు, నగల అపహరణ తదితర అంశాలపై ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 54 మంది మహిళలు వినతులు సమర్పించారు. వీటిలో జాతీయ కమిషన్‌కు నేరుగా ఫిర్యాదు చేసినవి 31, వన్‌స్టాప్ సెంటర్‌లో నమోదైనవి ఏడు, వాక్ ఇన్ ఏడు, డొమెస్టిక్ వయులెన్స్ కింద మరో తొమ్మిది ఫిర్యాదులున్నాయి. సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ, సభ్యులు జయశ్రీ, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్, అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, కృష్ణకాంత్ పాటిల్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ కవిత, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి, పీడీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోసం కేసులో మరొకరి అరెస్టు

ఎండాడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కంబోడియా మయన్మార్, బ్యాంకాక్, లావోస్ తదితర దేశాలకు ఉద్యోగాల పేరుతో యువతను తీసుకువెళ్లి చైనా స్కాం కంపెనీల్లో చేర్పిన మరో వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ ఉద్యోగాలంటూ చైనా స్కాం కంపెనీలకు పంపిస్తున్న ఏజెంట్లను ఇప్పటికే అరెస్టుచేయగా తాజాగా కంబోడియా నుంచి భారత్‌కు వచ్చిన మరొకరిని అరెస్టు చేశారు విశాఖకు చెందిన నవీన్‌కు ఆకుల రాజశేఖర్, నరేంద్రతో పరిచయం ఉంది. వారు కంబోడియా చైనా స్కాం కంపెనీల్లో పనిచేస్తూ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్నారు. నిందితుడు నరేంద్ర భారత్‌కు చేరుకోగానే సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే అరెస్టైన వారు ఇచ్చిన సమాచారం మేరకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకి చెందిన లక్కింశెట్టి నాగదుర్గారావు, కడప జిల్లా బ్రహ్మంగారిమఠానికి చెందిన లెక్కల వెంకటసాయినాథ్‌రెడ్డిలను అరెస్టు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సీతంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పీఅండ్‌టీ కాలనీలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలానికి ఎస్‌ఐ ధర్మేంద్ర, సిబ్బంది వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేనట్లు గుర్తించారు. అనారోగ్యం లేదా మద్యపానం కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94409 04332, 87129 45456 ఫోను నెంబర్లలో సంప్రదించాలని సీఐ డి.వి.రమణ తెలిపారు.

లైంగికదాడి కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బాధిత బాలికకు ప్రభుత్వం రూ.3 లక్షలు పరిహారంగా చెల్లించాలని సూచించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి.. భీమిలి మండలం తాటితూరుకు చెందిన ముద్దాయి సరగడ సన్యాసిరావు (45) గత ఏడాది ఏప్రిల్ 30న అమ్మమ్మతో కలిసి పశువులు మేపేందుకు వెళ్లిన బాలిక (8)ను బైక్‌పై వచ్చి సమీపంలోని మొక్కజొన్న తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. తీవ్ర రక్తస్రావంతో బాలిక అమ్మమ్మకు విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిశ ఏసీపీ సీహెచ్ వివేకానంద కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

'ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి'

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను గాడిన పెట్టాలనే యోచనతో ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని, విధుల్లో చేరనున్న టీచర్లు ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు కృషిచేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు. జగనన్న కిట్లకు రాజకీయ రంగు పులిమి విద్యా వ్యవస్థను సర్వనాశనం చేయడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల దగ్గర కాపలా కాయించిన చరిత్ర గత ప్రభుత్వానిదేనన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. కాబోయే టీచర్లు వ్యవస్థను పరిరక్షించాలన్నారు.

భవిష్యత్తు ప్రణాళికల కోసమే 'సేనతో సేనాని'

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల. పక్కన డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, నాయకులు.

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి. జనసేన పార్టీ పురోభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించడానికే పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సేనతో సేనాని కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. హోటల్ దసపల్లాలో పార్టీ నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుటుంబంలా సాగుతోందని, 14 నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. దీనిపై ఈ నెల 28, 29, 30 తేదీల్లో విశాఖలో నిర్వహించే సమావేశాల్లో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దిశా నిర్దేశం చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రప్పించిందన్నారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారుతుందన్నారు. అచ్యుతాపురం వద్ద రూ.1.7 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ వస్తుందని, నక్కపల్లిలో ఆర్సెరల్ మిట్టల్ స్టీల్ ప్లాంటు ఏర్పాటు కానుందని, ఫార్మా సెజ్ కూడా వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అంటే పవన్‌కల్యాణ్‌కు అమిత ప్రేమని, అందుకే ఇక్కడ సమావేశాలు నిర్వహిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం సుస్థిరమైన ప్రభుత్వం ఉండాలనేది పవన్ ఆలోచన అని, దానికి అంతా కట్టుబడి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దూలం గోపి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడి కథాంశమే 'అర్జున్ చక్రవర్తి' చిత్రం



అప్పన్న ఆలయంలో చిత్ర బృందం

మహరాణిపేట/సింహాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడాకారుడి వాస్తవ కథ ఆధారంగా 'అర్జున్ చక్రవర్తి' సినిమా తీశామని చిత్ర బృందం తెలిపింది. అర్జున్ రామరాజు, సీజారోజ్‌లు హీరో, హీరోయిన్లుగా విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో రూపొందించిన 'అర్జున్ చక్రవర్తి' సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం హోటల్ దసపల్లాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో విజయరామరాజు మాట్లాడుతూ కబడ్డీ చాంపియన్ 'అర్జున్ చక్రవర్తి' బయోపిక్ ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కించామన్నారు. నిర్మాత గుబ్బల శ్రీను మాట్లాడుతూ ట్రైలర్ అంచనాలను పెంచిందన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, ప్రో కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 29న సినిమా విడుదలవుతుందన్నారు. హీరోయిన్ సీజారోజ్, నటుడు దయానంద్‌రెడ్డి, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి చిత్ర బృందం దర్శించుకుంది. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని సినిమా విజయం సాధించాలని ప్రార్థించింది. అంతరాలయంలో అర్చకులు సభ్యుల గోత్రనామాలతో పూజలు చేశారు. గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు ప్రసాదాలను అందజేశారు.

రైల్వేజోన్‌ను మరింత అభివృద్ధి చేయాలి



జీఎం సందీప్‌మాథుర్‌ను సత్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌ను మరింత అభివృద్ధి చేయాలని, విశాఖకు జాతీయస్థాయి గుర్తింపు వచ్చే మరిన్ని ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని ఎంపీ శ్రీభరత్ దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌ను కోరారు. చినవాల్తేరు రైల్వే గెస్ట్ హౌస్‌లో మంగళవారం ఆయన జీఎంను కలిశారు. కొత్త రైల్వే సేవలు, సాంకేతికత, రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. స్పందించిన మాథుర్ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, చలసాని గాంధీ పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

- బాబాయితో కలిసి కుమార్తెల ఘాతుకం
- ముగ్గురినీ అరెస్టు చేసిన పోలీసులు

అనకాపల్లి రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలం బాటజంగాలపాలెం వద్ద మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమె కుమార్తెలు.. బాబాయితో కలిసి హత్య చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. ఒడిశాకు చెందిన బంకెల సంతు(37)కు భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. సంతు ఇద్దరు కుమార్తెలతో కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్‌లో ఉంటోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, చెడు వ్యసనాలకు లోనయింది. దీనిపై కుమార్తెలతో పాటు మరిది మురళీధర్ ఆమెతో గొడవపడ్డారు. చిన్న కుమార్తె తల్లి ఫోన్‌లో అసభ్యకర దృశ్యాలు, బెట్టింగ్ యాప్‌లు గుర్తించింది. అక్క అనూషకు చెప్పడంతో ఆమె పంజాబ్ నుంచి వచ్చింది. ఈ క్రమంలో తల్లిని అంతమొందించాలని నిర్ణయించుకుని బాబాయి మురళీధర్ సాయం కోరారు. ముగ్గురూ కలిసి ఈ నెల 13న నిద్రలో ఉన్న సంతుని హత్య చేశారు. మృతదేహాన్ని మురళీధర్ స్నేహితుడి కారులో బాటజంగాలపాలెం వద్ద పెట్రోల్ పోసి నిప్పంటించాడు. పోలీసులు కేసును ఛేదించి మురళీధర్, అనూషను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితురాలిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు.